జాతీయ తెలుగు దినపత్రిక

NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ గురువారం 2 జూలై 2026 సంపుటి : 16 సంచిక : 142 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం సూర్యోదయం: 5:30 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 8:27 । చంద్రాస్తమయం: 7:12 తిథి: బహుళ విదియ ఉ. 7:42 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 8:27 వరకు, తదుపరి శ్రవణం, యోగం: వైధృతి సా. 4:19 వరకు, తదుపరి విష్కంభం, కరణం: గరజి ఉ. 7:42 వరకు, తదుపరి వణిజ రా. 8:18 వరకు, తదుపరి భద్ర

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



## మంజీరా నదిలో ఇసుక మాఫియా



**టిప్పర్ల క్వారీ బంద్ అయినా ఆగని తవ్వకాలు**

**అనుమతులు లేకుండానే అడ్డదారిలో రవాణా**

**ట్రాక్టర్లే కాదు, ట్రాలీ ఆటోలు, బొలెరాలలో సైతం తరలింపు**

**ఇసుకాసురులకు కళ్లెం వేయడంలో వైఫల్యం**

**బోధన్**

మంజీర తీరంలో ఇసుక తోడేళ్లు విజృంభిస్తున్నాయి. అనుమతుల్లేకుండా నదీగర్భంలోని ఇసుకను తోడేస్తున్నాయి. ట్రాక్టర్లలోనే కాదు, ట్రాలీ ఆటోలు, బొలెరే వంటి వాహనాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో బోధన్ డివిజన్‌లోని పెద్ద క్వారీలు బంద్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఇసుక మాఫియా మరో రూపంలో తమ అక్రమ దందాను నడిపిస్తున్నది. అక్రమ మార్గాల్లో ఇసుక రవాణా చేసేందుకు మంజీర నదిలో పగలనక, రాత్రనక ఇష్టమొచ్చిన రీతిలో ఇసుక కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం ట్రాక్టర్లలో ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ, అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. పొతంగల్, సాలూర, బోధన్, రెంజల్ మండలాల పరిధిలోని మంజీర తీరంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ.. అరికట్టాల్సిన సంబంధిత శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. ట్రాక్టర్లలోనే కాకుండా ట్రాలీ ఆటోలు, బొలేరో ట్రాలీ వాహనాల్లో కూడా ఇసుకను అక్రమంగా తరలించుకుపోతుండడం గమనార్హం. ట్రాలీల్లో ఇసుక కనబడకుండా ఉండేందుకు టార్పలిన్లు కప్పి ఇసుకను తీసుకెళ్తున్నారు. మరోపక్క కొందరు ఇందిరమ్మ ఇండ్ల అనుమతుల పేరిట ఇసుకను తీసుకెళ్లి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కోసమని అనుమతులకు తీసుకుని ఒకే పర్మిట్‌పై పదేపదే ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ఇసుక - మిగతా 2లో

## ప్రచార ఆర్భాటాలకే ప్రభుత్వం పరిమితం

**రూ.28వేల కోట్ల రైతుబంధు బకాయిలు ఎగ్గొట్టి, రూ.2500కోట్లు ఇస్తూ ఆర్భాటాలా!**

**అది ఆశీర్వాదసభ కాదు.. రైతు శాపనార్థాల సభ**

**రేవంత్ ప్రభుత్వం హామీల అమలుపై దృష్టిపెట్టాలి**

**మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల**



**మోర్తాడ్/వేల్పూర్**

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్లు మానేసి, హామీల అమలుపై దృష్టిపెట్టాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కేవలం ప్రచార ఆర్భాటాలకు పరిమితమయ్యారని మండిపడ్డారు. మంగళవారం శిల్పకళా వేదికలో నిర్వహించింది రైతుల ఆశీర్వాదసభ కాదని, అది అన్నదాతల శాపనార్థాల సభ అని పేర్కొన్నారు. వేల్పూర్‌లోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సభల ఖర్చు చూస్తుంటే చారానా కోడికి బారాణా మసాలా అన్న చందంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎలాంటి ఆర్భాటాలు, వృథా ఖర్చులు లేకుండా కేవలం ఒక ప్రెస్‌మీట్ ద్వారా ప్రకటించి 11 సీజన్లలో రూ.73వేల కోట్లు రైతుబంధు నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. ఒక్క రూపాయి కూడా ప్రజాధనాన్ని వృథా చేయలేదని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సీజన్లలో మూడు సీజన్ల రైతుబంధు ఎగ్గొట్టి దాదాపు రూ.28వేల కోట్లు రైతులకు బాకీ పడిందన్నారు. రూ.28వేల కోట్లుపాత బాకీలో నుంచి కేవలం రూ.2500కోట్లు విదిల్చి, దానికోసం వందల కోట్లతో అట్టహాసంగా సభలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు.

**ప్రజాధనం వృథా**

రాష్ట్రవ్యాప్తంగా పత్రికల్లో, టీవీల్లో భారీ ప్రకటనలు ఇస్తూ హైదరాబాద్‌తో పాటు తెలంగాణ అంతటా సీఎం రేవంత్‌రెడ్డి తన ముఖచిత్రంతోకూడిన పెద్దపెద్ద హోర్డింగ్‌లు పెట్టుకుంటూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని వేముల - మిగతా 2లో

## కేసీఆర్ రైతుల పాలిట ఆపద్బాంధవుడు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బాజిరెడ్డి జగన్**

**ధర్పల్లి**

తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ రైతుల పాలిట ఆపద్బాంధవుడని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పనికి మాలిన సంస్కారహీనమైన మాటలు మానుకొని, రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులు చేపట్టాలని సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించి, విస్తృతంగా సభ్యత్వ నమోదును చేపట్టాలని ఇన్‌చార్జి బాధ్యులకు సూచించారు. ఈ సందర్భంగా విలేకరులతో జగన్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రైతు ఏనాడూ బాధపడింది - మిగతా 2లో



## ఫీజు బకాయిలపై పోరుబాట

**కామారెడ్డి/ ఖలీల్‌వాడి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయి. అటు కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో యాజమాన్యాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలో మూడు బడ్జెలు ప్రవేశపెట్టింది. ఒక్క బడ్జెట్‌లో కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులు కేటాయించలేదు. అంతేగాకుండా ఈ పథకాన్ని రద్దు చేయడానికి కుట్ర చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



# బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు తగదు




**ప్రజా జ్యోతి బోధన్ జులై 01:** బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం తగదని ఎంఐఎం నాయకులపై బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మండిపడ్డారు. బుధవారం బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకిల్ అమీర్ నివాసంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ఎంఐఎం నాయకులు బీఆర్ఎస్ పార్టీపై, మాజీ ఎమ్మెల్యే షకీల్ పై విమర్శలు చేయడం సరికాదన్నారు. తమ వార్డులలో అభివృద్ధి కోసం తామంతా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ పార్టీపై సోషల్ మీడియా లో విమర్శలు చేయడం మానుకొని కాంగ్రెస్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకుని అనుభవిస్తున్న ఎంఐఎం కౌన్సిలర్ తన వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కో ఆప్షన్ ఎన్నికలలో తాము ఎవరికీ మద్దతు ఇవ్వకుండా స్థబ్దతగా ఉన్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన తాము అయిదుగురు కౌన్సిలర్లము ఒక తాటిపై ఉండి పట్టణ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో ముషీర్ బాబా, మోబీన్,

# బోధన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఒక్క ఓటుతో గెలిచి తన సత్తా చాటుకున్న ప్రధాన కార్యదర్శి. పి.సమ్మయ్య



**ప్రజా జ్యోతి బోధన్ జులై 01 :** బోధన్ బార్ అసోసియేషన్ 2026-27 ప్రధాన కార్యదర్శిగా పి.సమ్మయ్య ను తెలంగాణ హైకోర్టు ప్రకటించింది. మార్చిలో జరిగిన బోధన్ బార్ అసోసియేషన్ 2026-27 ఎన్నికలకు సంబంధించిన వివాదంపై తెలంగాణ హైకోర్టు మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. రిట్ పిటిషన్ నెం.9805/2026లో 24-06-2026న ఇచ్చిన తీర్పులో సమ్మయ్య అడ్వకేట్ ను బోధన్ బార్ అసోసియేషన్ 2026-27 సంవత్సరానికి చట్టబద్ధంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శిగా ప్రకటించింది. ఎన్నికల ఓట్ల లెక్కింపులో సమయ్య పి. అనుకూలంగా నమోదైన ఒక ఓటును, స్వస్తిక్ గుర్తు బదులుగా టిక్ (/) గుర్తు ఉన్నదనే కారణంతో ఎన్నికల అధికారి తిరస్కరించారు. అనంతరం ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చాయని ప్రకటించి, ప్రధాన కార్యదర్శి పదవిని ఆరు నెలల చొప్పున పంచుకోవాలని నిర్ణయించారు. ఈ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్ను విచారించిన గౌరవ హైకోర్టు టిక్ (వి) గుర్తు ద్వారా ఓటరు ఉద్దేశ్యం స్పష్టంగా వ్యక్తమైందని, అలాంటి ఓటును తిరస్కరించేందుకు బార్ అసోసియేషన్ బై-లాస్లో ఎలాంటి నిబంధన లేదని స్పష్టం చేసింది. అదేవిధంగా, ప్రధాన కార్యదర్శి పదవిని ఇద్దరు అభ్యర్థులు ఆరు నెలల చొప్పున నిర్వహించేలా నిర్ణయించేందుకు ఎన్నికల అధికారికి ఎటువంటి చట్టబద్ధమైన అధికారం లేదని పేర్కొంది. దీంతో తిరస్కరించిన ఓటును చెల్లుబాటు అయ్యేదిగా గుర్తించిన హైకోర్టు సమ్మయ్య కి మొత్తం 54 చెల్లుబాటు అయ్యే ఓట్లు ప్రత్యర్థి అభ్యర్థికి 53 ఓట్లు వచ్చినట్లు ప్రకటించి, బోధన్ బార్ అసోసియేషన్ 2026-27 సంవత్సరానికి ప్రధాన కార్యదర్శిగా చట్టబద్ధంగా ఎన్నికైన అభ్యర్థిగా ప్రకటించింది. సంబంధిత అధికారులు ఈ తీర్పును తక్షణమే అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ తీర్పు ప్రజాస్వామ్య ఎన్నికలలో ఓటరు ఉద్దేశ్యానికే అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని, సాంకేతిక కారణాలతో ఓటును తిరస్కరించరాదని, ఎన్నికల అధికారులు తమ అధికార పరిమితుల్లోనే వ్యవహరించాలని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమ్మయ్య మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మద్దతు తెలిపిన బోధన్ బార్ అసోసియేషన్ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయం కోసం తన తరఫున వాదించిన న్యాయవాదులకు, సహచరులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ గౌరవాన్ని కాపాడుతూ, ప్రతి సభ్యునికి సమాన సేవలు అందించేందుకు పారదర్శకత, ఐక్యత మరియు నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం గంగారెడ్డి, బార్ అసోసియేషన్ కోశాధికారి బానోత్ రమేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాఘవేందర్, అనిల్ కుమార్, న్యాయవాదులు ఎస్ ఎస్ ఆర్ కోటేశ్వరరావు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రైతుల పాలిట ఆపద్బాంధవుడు

-మొదటిపేజీ తరువాయి

లేదన్నారు. ఎకరం, రెండెకరాలు అంటూ వివక్ష లేకుండా ప్రతిఒక్క రైతుకు రైతుబంధు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు అందరికీ అందించడం చేతగాక ఎగబెట్టేందుకు సాకులు వెతుక్కుంటూ ఎకరం, రెండు ఎకరాలకు మాత్రమే డబ్బులు వేస్తూ రైతులను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. పాలన చేతగాక గత పాలకులను విమర్శించడం శోచనీయమన్నారు. రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సినిమాలోని పశుపతి కాదని, నేపాల్‌లో గల పశుపతినాథ్ లాంటి దైవమని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించి లబ్ధి పొందాలనుకుంటే రైతులే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పీసు రాజ్‌పాల్‌రెడ్డి, నల్ల హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార ఆర్భాటాలకే ప్రభుత్వం పరిమితం

-మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. ఈ అనవసర ప్రచారాలు, సభల ఖర్చులు తక్షణమే నిలిపివేసి ఆ డబ్బులను రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని సూచించారు. బాల్కొండ నియోజకవర్గంలో 52 వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 22వేల మందిరైతులకు మాత్రమే జరిగిందని, మిగిలిన 30వేల మంది రైతులు ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. రుణమాఫీ కాదు, రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం మాఫీ అయ్యిందని అన్నారు. మంత్రి తుమ్మల ఏసీ రూముల్లో కూర్చుని యూరియా యాప్ బాగున్నదని, 90శాతం రైతులు సంతోషంగా ఉన్నారని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఇదే మాట గ్రామాల్లోకి వచ్చి రైతుల మధ్య నిలబడి చెబితే రైతులు వారి గూబ గుయ్యుమనిపిస్తారని హెచ్చరించారు.

**రేవంత్‌రెడ్డివి ఉత్తర కుమారుడి ప్రగల్బాలు**

తాను మాట ఇస్తే తప్పను అని రేవంత్‌రెడ్డి పలికే ప్రగల్బాలు ఉత్తర కుమారుడి ప్రగల్బాలులా ఉన్నాయని, ఇది ప్రపంచంలో 8వ వింత అని ఎద్దేవా చేశారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తానని చెప్పి 900రోజులైనా ఏ ఒక్క హామీనైనా సంపూర్ణంగా అమలు చేయకపోవడం మాట తప్పడం కాదా అని నిలదీశారు.

**అప్పుల ప్రచారం అబద్ధం**

బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న అప్పుల ప్రచారాన్ని వేముల ప్రశాంత్‌రెడ్డి పూర్తిగా అబద్ధమని పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అప్పు కేవలం రూ.3లక్షల 80వేల కోట్లు మాత్రమేనని , పార్లమెంట్‌లో కాంగ్రెస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్రం స్పష్టమైన సమాధానం ఇచ్చిందని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేవలం రెండున్నరేండ్లలోనే ఏకంగా రూ.4లక్షల కోట్ల అప్పులు తెచ్చిందని, ఈ నిధులతో ఏం కట్టారో సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశా రు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు దాటుతున్నా పాలన చేయడం చేతకాక, ఇంకా కేసీఆర్ మీద , బీఆర్ఎస్ పార్టీ మీద పడి ఏడవడం రేవంత్‌రెడ్డి మానుకోవాలని వేముల హితువు పలికారు.

# మంజీరా నదిలో ఇసుక మాఫియా

-మొదటిపేజీ తరువాయి

తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కోసం రవాణా జరిగే ఇసుక ట్రాక్టర్లకు 'ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇసుక' అన్న బ్యానర్‌ను ఆ వాహనాలకు కట్టాలన్న నిబంధన ఉంది. ఈ నిబంధనను ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో ఏ వాహనం ఇందిరమ్మ ఇండ్ల కోసమో, ఏ వాహనం కమర్షియల్ అవసరాల కోసమో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఇలా ఇసుకను అక్రమ మార్గంలో తీసుకెళ్లి ఒక ట్రాక్టర్ ట్రాలీ ఇసుకను రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం 'మన ఊరు -మన ఇసుక' విధానం అమలులో విఫలమయిందన్న విమర్శలు వస్తున్నాయి. ఇసుక అవసరమైనవారికి సరసమైన ధరకు ఇసుక లభించకపోవడం, బ్లాక్ మార్కెట్‌లో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

**పట్టించుకోని రవాణా శాఖ**

వ్యవసాయ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ఇసుక అక్రమ రవాణా కోసం ఉపయోగిస్తున్నప్పటికీ రవాణాశాఖ పట్టించుకోవటం లేదు. దీంతో ఇసుక వ్యాపారం కోసమే ట్రాక్టర్లను కొనుగోలు చేయటం మంజీర తీరప్రాంత గ్రామాల్లో ఎక్కువగా జరుగుతున్నది. వ్యవసాయ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కమర్షియల్ ప్రయోజనాల కోసం వినియోగిస్తే కేసులు పెడతామంటూ రెండేండ్ల కిందట హడావుడి చేసిన రవాణాశాఖ అధికారులు ఇప్పుడు కిమ్మనడం లేదు. మంజీర తీరంలోని గ్రామాల్లో వ్యవసాయ అవసరాలకు మించి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు ఉండటం చూస్తుంటే.. ఇసుక అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల వెనుక ఉండే ట్రాలీలకు నంబర్ ప్లేట్లు ఉండాలి. అయితే, అనేక ట్రాలీలకు నంబర్ ప్లేట్లు ఉండటం లేదు. ఇలా, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇసుక అక్రమ దందాను అరికట్టాల్సిన అవసరం ఉన్నదని స్థానికులు కోరుతున్నారు.

**ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు**

బిచ్కుంద, జూలై 1: అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలంలోని గుండె నెమ్లి గ్రామ శివారులోని మంజీర పరీవాహక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా, బండా రెంజల్ గ్రామస్తులు బుధవారం రాత్రి అడ్డగించారు. వే బిల్లులు లేవని తేలడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై రెవెన్యూ అధికారుల వివరణ కోరగా, అది మైన్స్‌కు సంబంధించినదని, ప్రభుత్వ అనుమతితోనే క్వారీ కొనసాగుతున్నదని సమాధానమిచ్చారు. అయితే, అనుమతులు ఉంటే రాత్రి వేళ ఇసుక తవ్వడంతో పాటు తరలించాల్సిన అవసరం ఏముందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బండారెంజల్ శివారులోని మంజీరలో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని గ్రామస్తులు గతంలో ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినప్పటికీ కొందరు అక్రమార్కులు ప్రభుత్వ అనుమతుల పేరిట రాత్రివేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. మరోవైపు, బండా రెంజల్ గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నది నిజమేనని పోలీసులు చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

# లయన్స్ క్లబ్ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలు




**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) జులై.1** ఇందల్వాయి మండలంలోని కేకే తండాలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో బుధవారం ఇందల్వాయి మండలం వెంగల్ పాడ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు నోట్ బుక్కులు,పెన్నులు,పెన్సిళ్లు,ఎనర్జీ డ్రింకులు,జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు..పాఠశాల అవరణలో లయన్స్ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యాతిథిగా లయన్స్ జోన్ చైర్మెన్ అబ్బాయి లింబాద్రి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు..పోటీతత్వంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి.రాఘవేందర్, చింతల గంగాదాస్, కోశాధికారి అంకం రాజేందర్,వెంగల్ పాడ్ ఉప సర్పంచ్ మహిపాల్ నాయక్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యెర్రగుంట కృష్ణవేణి, ఉపాద్యాయులు శిరీష,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల త్వరగా పూర్తి చేయాలని ఎమ్మార్వో బాలయ్య





**ఇందల్వాయి, జూలై. (ప్రజాజ్యోతి )** మండల పరిధిలోని గంగారం తండా గ్రామాల్లో బుధవారం ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. బాలయ్య మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నమోదు, సవరణ ప్రక్రియలో భాగంగా ఈ ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఓటరుకు ఈ ఫారాలు అందేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) ఆయన ఆదేశించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల బీఎల్ఓలు నరేందర్ గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ ఉపసర్పంచ్ ధూమ, సూపర్వైజర్లు పంచాయతీ సెక్రటరీ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ





**ప్రజా జ్యోతి బోధన్ జులై 01 :** బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మున్సిపల్, ఐకెపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విచ్చేసి మహిళలకు 150కుట్టు మిషన్ లు, 24,000చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ?కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందిస్తూ, వారు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించేలా ప్రోత్సహిస్తోందన్నారు. విద్యా, ఆరోగ్య రక్షణకు పెద్దపీట ?బాలికల విద్యా శాతాన్ని పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నివాస పాఠశాలలు (గురుకులాలు), కళాశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. మహిళల అభివృద్ధి లేనిదే సమాజ అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, ఐకెపీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, నాగేశ్వర్రావు, మోబీన్, తూము శరత్ రెడ్డి, పాషా, దాము,ఆదినారాయణ ,గౌస్, సంగ్రామ్ ,శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్



తెలంగాణ రాష్ట్రం దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్రంలో ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి స్వయంగా సమయం, స్థలం నిర్ణయించి చెబితే చర్చకు వస్తానని అన్నారు. నిజంగానే రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ ప్రకటించారు. సిఎం, అయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడి వల్లనే తెలంగాణ దివాళ తీస్తున్నదన్నారు.కెటిఆర్ ప్రెస్ మీట్ లోని ముఖ్యమైన పాయింట్స్ రేవంత్ రెడ్డి భావ దారిద్ర్యంతో మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం పైన విషం చిమ్ముతున్నాడు. ఎంత దివాలాకోరు మనిషి అయినా, నేను దివాలా తీశాను అని చెప్పి, మెడలో బోర్డు వేసుకొని తిరగడు. కానీ రేవంత్ రెడ్డి ప్రతిసారి తెలంగాణ గురించి మాట్లాడుతూనే ఉన్నారు. ఒకసారి దివాలా అంటాడు, మరోసారి ఎయిడ్స్ రోగి అంటాడు, మరోసారి క్యాన్సర్ పేషెంట్ అంటాడు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రం గురించి ఇంత నీచంగా మాట్లాడే ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదు అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి, మరి 72 సార్లు ఎందుకు ఢిల్లీకి వెళ్ళాడో చెప్పాలి. 30 నెలల్లో 72 సార్లు ఢిల్లీకి వెళ్లి ఎవరిని బతిమాలుకోవడానికి వెళ్తున్నారో ప్రజలకు చెప్పాలి. నిజంగానే రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, రెండున్నర సంవత్సరాల పాటు ఇక ఢిల్లీకి వెళ్లకుండా తెలంగాణలోనే ఉండి పరిపాలన చేసి తన నిబద్ధత చాటుకోవాలి.రేవంత్ రెడ్డి చెప్తున్నట్లు తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రం ఏమాత్రం కాదు. ఒకనాడు దశరథి అన్నట్లు నా తెలంగాణ కోటి రత్నాల వీణ అయితే, మా కె.సి.ఆర్ గారి సారధ్యంలో తెలంగాణ కోటి ఎకరాల మాగాణ అయ్యింది. పంటలు, ఆదాయం, సాగునీరు అన్నీ రెట్టింపుకు మించి అభివృద్ధి సాధించింది. అయినా ఇంతటి ధనిక రాష్ట్రాన్ని పట్టుకొని రేవంత్ రెడ్డి ఎందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారో తెలియదు. తెలంగాణ వ్యక్తిని చూసి కాదు, రేవంత్ రెడ్డిని చూసి అసహ్యించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ఒక దొంగ కాబట్టే, రేవంత్ రెడ్డిని చూడగానే ఒక దొంగ వచ్చాడు అని అనుకోవడంలో తప్పు లేదు. కేంద్రం సహకరించకున్నా అద్భుతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోయాము. ఇతర రాష్ట్రాల మాదిరి తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు ఇవ్వకున్నా, ఒక్క రూపాయి అదనంగా ఇవ్వకున్నా అద్భుతమైన ప్రగతి పథంలో తీసుకుపోయాము. కేవలం కే.సి.ఆర్ గారికి తెలంగాణ అనేది నా సొంత రాష్ట్రం, సాధించి పోరాడి తెచ్చుకున్న రాష్ట్రం అన్న నిబద్ధతతో పని చేసినాడు, కాబట్టే ఇంత అద్భుతంగా తెలంగాణ అభివృద్ధి చెందింది.ఎంతసేపు అప్పుల పేరుతో రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడు. కానీ బి.జె.పి ఎం.పి రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలంగాణ అప్పులు కేవలం రెండు లక్షల డెబ్బై వేల కోట్లు మాత్రమే అని స్పష్టంగా కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఆయన అయినప్పటికీ రేవంత్ రెడ్డి మాత్రం ఆరు లక్షలు, ఏడు లక్షలు, ఎనిమిది లక్షలు అంటూ రోజుకొక మాట అప్పుల గురించి మాట్లాడుతున్నారు. కేవలం అప్పులే కాదు, రాష్ట్ర ఆదాయంతో పాటు అప్పులకు కడుతున్న మిత్తి లెక్కల పైన కూడా తప్పుడు మాటలు మాట్లాడుతూ, తెలంగాణను ఏదో దివాలా తీసిన రాష్ట్రంగా చూపించే నీచమైన ప్రయత్నం చేస్తున్నాడు.ఒకవేళ రేవంత్ రెడ్డి అంటున్నట్టు తెలంగాణ దివాలా తీయాల్సి వస్తే, కచ్చితంగా అది ఆయన కుటుంబ సభ్యులు, సోదరులు తన మంత్రివర్గ సహచరులు చేస్తున్న అవినీతి, దోపిడి వల్లనే, లూటీ వల్లనే తెలంగాణ దివాలా తీస్తున్నది అన్నారు. అన్ని తప్పుడు లెక్కలు దొంగ మాటలు చెప్పి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం ఒక్క రాష్ట్ర రైతాంగానికే లక్ష 13 వేల కోట్ల రూపాయల కోట్లు ఎగగొట్టారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణ హామీ, రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇస్తామని చెప్పిన ఆర్థిక సహాయం చేయకుండా పూర్తిగా లక్షా 13 వేల కోట్ల రూపాయల రైతులకు ఎగగొట్టి, ఈరోజు సిగ్గులేకుండా రాష్ట్రంలోని రైతాంగం గురించి వారేదో సంతోషంలో ఉన్నారు అని చెప్పుకుంటూ, రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని కే.టి.ఆర్ అన్నారు.

# అయోధ్య రాముడి గుడిలో దొంగతనానికి యూపీ, కేంద్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలి

## జగ్గారెడ్డి... పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి డిమాండ్

**హైద్రాబాద్ :** అయోధ్య రాముడి గుడిలో దొంగతనానికి యూపీ, కేంద్ర ప్రభుత్వలే బాధ్యత వహించాలని జగ్గారెడ్డి... పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సాక్ష్యత్తు అయోధ్య రాముడి గుడిలో దొంగతనం జరిగింది.అయోధ్య లో గుడికి వెళ్ళే భక్తులు భక్తి, ప్రేమ తో హుండీలో కానుకలు వేసి వెళ్తారు.ఏ రోజైతే అయోధ్య రామాలయంలో దొంగతం జరిగిందో అప్పటి నుండి మోడీ, అమిత్ షా ఒక్క మాట కూడా మాట్లాడలేదు.కానీ రాహుల్ గాంధీ తక్షణమే స్పందించారన్నారు.పార్లిమెంట్ మెంబెర్స్ తో కమిటి వేసి అయోధ్య వెళ్ళి విజిట్ చేసి వచ్చారు.దేవుడి గుడిలో దొంగతనం జరగడం తో ప్రజల నమ్మకం పోయింది దీనికి యూపీ, కేంద్ర ప్రభుత్వలే బాధ్యత వహించాలన్నారు. 40 ఏళ్ల నుండి బీజేపీ రాముడి పేరుతో రాజకీయం చేసి ప్రభుత్వం లోకి వచ్చారు.కేంద్రం లో బీజేపీ అధికారం లో ఉంది అంటే కేవలం అయోధ్య లో రాముడి గుడి పేరుతో నే..కేవలం గుడి కట్టడమే మీ బాధ్యత కాదు.దాని సక్రమంగా చూసుకోవడం కూడా మీ బాధ్యతే..దేవుడి పేరుతో అధికారంలోకి వచ్చారు కానీ మోడీ, అమిత్ షా ఎందుకు మాట్లాడలేదు.మేము రాజకీయం చేయడం లేదు... ప్రశ్నిస్తున్నాముఅయోధ్య లో గుడి కట్టి మీరు పబ్లిసిటీ తీసుకున్నారు.కానీ దొంగతనం జరిగితే మాత్రం బాధ్యత వహించడం లేదు.




మీకు శ్రీరాముడు కేవలం ఓటు బ్యాంక్ మాత్రమేనా..! ప్రశ్నించారు. రాజకీయాలకు వాడుకొని ఇలా వదిలేస్తారా..! దొంగతనం జరిగితే ఇప్పటివరకు పట్టించుకోరా...? ట్రస్ట్ సభ్యులతో రాజీనామా చేయించారు.. ఇంతే నా చేసేది.ప్రతి భక్తుడికి మీరు సమాధానం చెప్పాలని జగ్గా రెడ్డిడిమాండ్ చేశారుదేవుడి పై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయకండిదేవుడి పూజ చేసి మోడీ పబ్లిసిటీ తీసుకుంటారు. కాని రాహుల్ గాంధీ పూజ చేస్తారు పబ్లిసిటీ తీసుకోరు. రాహుల్ గాంధీ దేవుడు చెప్పిన విషయాలను ఆచరణలో పెడుతారు.స్వాతంత్రానికి ముందు మోడీ, అమిత్ షా చిన్న పిలల్లు, అప్పుడే పుట్టినరోజు ఉంటారు.రాముడి పాలసీ నే జవహర్ లాల్ నెహ్రు అమలు చేశారు అలాగే పరిపాలించారు.రాముడు ఎలా పరిపాలించారు రాహుల్ కుటుంబం అలాగే పరిపాలించింది, పరిపాలిస్తుంది కానీ పెద్ద పెద్ద మాటలు చెప్పే మోడీ, అమిత్ షా మాత్రం అలా చేయడం లేదు.కనీసం దొంగతనం జరిగితే ఇప్పటివరకు మోడీ, అమితాషా బాధ్యతగా మాట్లాడలేదు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ చిన్న చిన్న వి జరుగుతుంటాయని అంటున్నారు.అయోధ్య లో దొంగతనం జరిగితే చిన్న విషయమా..!రాంచందర్ రావు జాతీయ పార్టీ కి రాష్ట్ర అధ్యక్షుడు ఇది చిన్న విషయంగా కనిపిస్తుందా..!ప్రజలు ఇది గమనించాలి..ఆదే కేంద్రం లో బీజేపీ అధికారంలో లేకపోతే, యూపీ లో అధికారం లో లేకపోతేఇలా దొంత తనం జరిగి ఉంటే ఊరుకునే వరా..!మీరు అధికారం లో ఉంటే చిన్నది....!కాంగ్రెస్ అధికారం లో ఉంటే పెద్దదిగా చూపించి దేశం అంత ఉద్యమం చేసే వారు కదా..!కానీ రాహుల్ గాంధీ అలా చేయడం లేదు...దొంగతనం జరిగింది బాధ్యత తీసుకోండి అంటున్నారు.ఇదే బిజేపీ -కాంగ్రెస్ కి మధ్య ఉన్న తేడా.మతం పేరుతో బీజేపీ బ్రతుకుతుంది..కానీ కాంగ్రెస్ అన్ని కుల మతాలని కలుపుకుంటూ వెళు _ంది.ఇప్పటికైనా మోడీ, అమిత్ షా సారీ చెపాలని జగ్గా రెడ్డ్య డిమాండ్ చేశారు

# భూలక్ష్మి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

**జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పుల్లూరి రామయ్యపల్లి వార్డులో నిర్వహించిన భూలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బుధవారం భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు పద్మ దంపతులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన భక్తులకు,గ్రామ ప్రజలకు పేరు పేరునా శుభాకాంక్షలు తెలిపారు. భూలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు పుల్లూరు రామయ్యపల్లి వార్డు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్న ఎమ్మెల్యే గారు, గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. పుల్లూరు రామయ్య పల్లి గ్రామంలో సుమారు నాలుగు కోట్ల రూపాయలతో పెద్దమ్మతల్లి దేవాలయం, లక్ష్మీ దేవర దేవాలయం,అంతర్గత రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల వనమహోత్సవం.

**జయశంకర్ భూపాలపల్లి.** జులై మొదటి వారం జులై 1 నుండి 7వ తేది వరకు నిర్వహించవలసిన వనమహోత్సవ కార్యక్రమం బాలుర పాఠశాల మహాదేవపూర్ లో బుధవారం గ్రామ సర్పంచ్ హసీనా బాను మొక్కలు నాటి ప్రారంభించారు. మహాదేవపూర్ ఎంపీడీఓ రవీంద్ర నాథ్,ఎంఈఓ పురుషోత్తం రెడ్డి,రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అడప రాజయ్య, మహమ్మద్ అక్బర్ ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, ఎన్ జి సీ ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులు రాజిరెడ్డి,తిరుపతి రెడ్డ, రాజయ్య, సిరంగి రమేష్ అనిల్,సమ్మయ్య,అనిత కోటేశ్వర్, శ్రీనివాస్ మరియు విద్యార్థులు పాల్గొని ఒక్కొక్క ఉపాధ్యాయుని(టీచర్ కే నామ్ పే ఏక్ పేడ్ ) పేరుతో ఒక మొక్క నాటి,వీటి సంరక్షణ బాధ్యత కూడా విద్యార్థులు తీసుకొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ పౌరుని బాధ్యతని గ్రామ సర్పంచ్ అన్నారు. పర్యావరణాన్ని కాపాడక పోతే మానవులు తీవ్ర సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందని ఎన్ జీ సీ ఇంచార్జి టీచర్ ప్రభాకర్ రెడ్డి అందరికి వివరించారు.ఈరోజు నుండి మనందరం మొక్కలు నాటదాన్ని ఉద్యమంగా నిర్వహించాలని ఎం ఈ ఓ పురుషోత్తం రెడ్డి అన్నారు.

## ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

**వికారాబాద్ :** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద మైనారిటీ విద్యార్థుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (స్ప్రింగ్ సీజన్ - 2026) దరఖాస్తు గడువును పొడిగించినట్లు వికారాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం. సుధీర్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా ఉపకార వేతనం పొందాలనుకునే విద్యార్థులు ప్రభుత్వం ద్వారా ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలలో 2026 జనవరి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీలోపు ప్రవేశం (అడ్మిషన్) పొంది ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు జూలై 15 వ తేదీ వరకు వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కలెక్టరేట్ లోని తమ కార్యాలయంలో (గా16) సంప్రదించాలన్నారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు' విద్యార్హతలు ' దరఖాస్తు చేసుకునే దేశాల జాబితా మరియు అభ్యర్థుల ఎంపిక విధానం తదితర సమాచారాన్ని అధికారిక వెబ్సైట్లో పొందుపరిచినట్లు అధికారి ఎం.సుధీర్ వివరించారు. అర్హులైన మైనారిటీ విద్యార్థులు సకాలంలో స్పందించి ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఓడిపోతాడని రేవంత్ రెడ్డికి భయం మొదలైంది

**హైదరాబాద్ :** వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని నిన్న రేవంత్ రెడ్డి ఒప్పుకున్నాడని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ చనిపోయింది, మొలకెత్తనివ్వను అన్నాడు. కానీ నిన్న అధికారం శాశ్వతం కాదు, ప్రభుత్వాలు మారుతుంటాయి, కేసీఆర్ గెలిచినా ఏమీ చేయడు అంటున్నాడు. అంటే ఓడిపోతాడని రేవంత్ రెడ్డికి భయం మొదలైంది. రైతులు నన్ను కంచె వేసి కాపాడుకోవాలి అని వేడుకుంటున్నాడు. రైతు డిక్లరేషన్ పేరిట రైతులను నిండా ముంచినందుకు నిన్ను రైతులు కాపాడతారా అని ప్రశ్నించారు.

## ఆదాయ సమీకరణలో చేజింగ్ సెల్ ఏర్పాటు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలను సాధించడానికి ఆదాయ సమీకరణపై కచ్చితంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లీకేజీలను అరికట్టి ఆదాయ సమీకరణకు సంబంధించి చేజింగ్ సెల్ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ముఖ్యమంత్రిరు ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , సలహాదారు కె రామకృష్ణారావు , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాయ పెంపు విషయంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్తో పాటు ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ఆదాయ సమీకరణలో చేజింగ్ సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా శాఖలవారిగా బడ్జెట్ను తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానంగా భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెట్ ఊహాజనితం కాదన్న విషయం గుర్తుపెట్టుకోవాలని, వాస్తవికత ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలని స్పష్టం చేశారు. ఆయా శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

## మోతుకుల కుంట ఔట్‌లెట్లో గుర్తు తెలియని మృతదేహం

**హైదరాబాద్ :** నాలాల్లో పూడిక తీస్తున్నప్పుడు.. పరుపులు, దిండులు, బెడ్‌షీట్లు, పెద్దమొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడడం ఇప్పటివరకూ గమనిస్తూ వస్తున్నాం. బుధవారం హైడ్రా డీఆర్ ఎఫ్, మాన్సూన్ రెస్పాన్స్ టీంలు కలసి పూడికతీస్తుండగా.. ఏకంగా ఒక మృతదేహమే బయటపడింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారంలోని మోతుకుల కుంట ఔట్లెట్ నాలాలో పూడిక తీస్తుండగా గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. పెద్దమొత్తంలో పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగిస్తుండగా.. ఈ మృతదేహం చెత్తతో కలసి బయటకు వచ్చింది. ఏమాత్రం గుర్తు పట్టడానికి వీలు లేకుండా.. ఎముకలకు శరీరం అతుక్కుని ఉంది. అల్వాల్ పోలీసులకు హైడ్రా సిబ్బంది సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆ మృతదేహం సుమారు 15 రోజుల క్రితం నాటిదిగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

## గాంధీ ఆసుపత్రిలో డాక్టర్స్ డే

**సికింద్రాబాద్ :** డాక్టర్స్ డే సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ లో సూపరింటెండెంట్ డా. వాణితో పాటు హెచ్ ఓ డీ లు, సీనియర్ వైద్యులను మాజీ కార్పొరేటర్ ఏల్చూరి సావిత్రి మహేష్ ఆధ్వర్యంలో స్థానిక నేతలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు రోగులకు అందిస్తున్న సేవలను గురించి కొనియాడారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వాణి మాట్లాడుతూ ఈ సన్మానాలు, సత్కారాలు వైద్యుల సేవలకు గుర్తింపే కాకుండా మరింత ఉత్సాహంగా పనిచేయడానికి పునరుత్తేజాన్ని ఇస్తాయని, మా బాధ్యతను మరింత పెంచుతాయని తెలిపారు. గాంధీ ఆసుపత్రి ప్రతిష్టను మరింత పెంచడానికి అన్ని విభాగాల వైద్యులు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది, పారమేడికల్ సిబ్బంది అందరం కలసి సమిష్టిగా కృషి చేస్తామని వెల్లడించారు. వైద్యులందరికి వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ



**హైదరాబాద్ :** పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పు చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో బండి భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం పరారైన అతణ్ని మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 24 వరకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గడువు ముగియడంతో గత వారం మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రస్తుతం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఎల్లుండి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## సంపాదకీయం

# మారిన ఆప్ టెంపుల్ రన్

జాబ్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం రాష్ట్రంలోని 22 పట్టణాల్లో ప్రతీ సోమవారం సాయంత్రం "ఏక్ శామ్ శివ్ కా నామ్" కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కార్యక్రమాల్లో శివుని పేరిట భజనలు, పూజలు నిర్వహించి, ధార్మిక సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. "జై శ్రీరాం", "హర హర మహాదేవ్" నినాదాలు ఇచ్చి, ప్రభుత్వ నిధులతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమృత్‌సర్‌లోని వాల్మీకి ఆశ్రమం అభివృద్ధి, పాటియాలాలో కాళీమాత ఆలయ నిర్మాణం వంటి ప్రకటనలు కూడా చేశారు. ముఖ్యమంత్రి తీర్థయాత్ర యోజన కింద సాలాసర్ బాలాజీ, ఖాతూశ్యాం, మథుర–బృందావన్, హృషికేష్–హరిద్వార్, ఆనంద్‌పూర్, అమృత్‌సర్ వంటి క్షేత్రాలకు ప్రజలను తీసుకెళ్లే హామీ ఇచ్చారు. ఈ పథకాలను పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. సీఎం భగవంత్ మాన్, కేజ్రీవాల్ ఇద్దరూ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ప్రజలు "జై శ్రీరాం" అని నినదించగా, నాయకులు "జై సియారామ్" అని చెప్పారు. కేజ్రీవాల్ మాట్లాడుతుండగా సీఎం భగవంత్ మాన్‌ను చూసి ప్రజలు చప్పట్లు కొట్టడం గమనార్హం. పంజాబ్‌లో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పట్టణాల్లో హిందువులు గణనీయంగా ఉండటం, గ్రామాల్లో సిక్కులు ఎక్కువగా ఉండటం వల్ల హిందూ ఓట్లను ఆకర్షించడానికి ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు కనిపిస్తోంది. ఆప్ తనను తాను సెక్యులర్ పార్టీగా చెప్పుకుంటూ, ఇప్పుడు స్పష్టంగా హిందూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. సాధారణంగా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు అంటే బీజేపీ గుర్తుకు వస్తుంది. సీఎం అయితే యోగా ఆదిత్యనాథ్ గుర్తొస్తారు. కానీ దేశంలో హిందువుల పునరేకీకరణ నేపథ్యంలో ఇప్పుడు అన్ని పార్టీలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఢిల్లీలో రెండోసారి అధికారంలోకి రావడానికి హనుమాన్ చాలీసా పాడిన ఆప్, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కూడా చండీ మంత్రం, హనుమాన్ చాలీసా ఆలపించింది. ఇప్పుడు పంజాబ్‌లో కూడా ఇదే వ్యూహం అనుసరిస్తోంది. అయితే కేజ్రీవాల్ ప్రకటనలు చేయడం, సీఎం భగవంత్ మాన్ వెనకబడి ఉండటం వల్ల పార్టీలో సీఎం, కన్వీనర్ మధ్య సఖ్యత లేదన్న అభిప్రాయం బయటకు వస్తోంది. రామనామం ఓట్లు తెచ్చే అవకాశం ఉందని ఆప్ భావిస్తోంది. దేశంలో రాజకీయ పార్టీలు కులం, మతం ఆధారంగా రాజకీయాలుచేస్తున్నాయి. అయితే ప్రస్తుతం హిందుత్వం బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఒకప్పుడు మైనారిటీలకు మద్దతు ఇస్తూ సెక్యూలరిజం అని చెప్పుకున్న పార్టీలు కూడా ఇప్పుడు హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆప్ తన మొదటి దశలో "సెక్యులరిజం", "వ్యవస్థ మార్పు" అనే నినాదాలతో అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్పుడు హిందూ మెజారిటీ ఓట్లు అవసరమైన చోట హిందూ ధార్మిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా తన వ్యూహాన్ని మార్చుకుంటోంది. పంజాబ్‌లో సిక్కు–హిందూ సమతుల్యత ఉంది. పట్టణాల్లో హిందువులు ఎక్కువగా ఉండటం వల్ల వారి ఓట్లు కావాలంటే ఇలాంటి కార్యక్రమాలు అనివార్యం అని ఆప్ భావిస్తోంది. అయితే ఇది పార్టీ ఆదర్శాలకు విరుద్ధంగా ఉందని విమర్శకులు అంటున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక గమ్యస్థానాలకు జరిగిన ప్రయాణాల్లో 53 శాతానికి పైగా జెన్ జి, యువతరానిదే వాటా ఉండటం గమనార్హం. 2025తో పోలిస్తే ఈ సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. ఈ మార్పు కేవలం ప్రయాణ ధోరణి మాత్రమే కాదు.. యువతలో చోటుచేసుకుంటున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. బీచ్‌లు, పార్టీ హబ్‌లు, నైట్‌లైఫ్ గమ్యస్థానాల కంటే దేవాలయాలు, యోగా కేంద్రాలు, ధ్యాన క్షేత్రాల వైపు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వారు కేవలం దర్శనం కోసం కాకుండా, స్థానిక సంస్కృతిని అనుభవించడం, ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందడం, జీవితానికి అర్థవంతమైన అనుభూతులను జోడించుకోవడం కోసం ఈ ప్రయాణాలను ఎంచుకుంటున్నారు. జెన్ జి తరానికి అత్యంత ఇష్టమైన ఆధ్యాత్మిక గమ్యస్థానంగా తిరుపతి నిలిచింది. ముఖ్యంగా బెంగళూరు?తిరుపతి మార్గం యువ యాత్రికులలో అత్యంత ప్రజాదరణ పొందిన రూట్‌గా అవతరించింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ దర్శనం కోసం లక్షలాది మంది యువకులు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. హైదరాబాద్?తిరుపతి మార్గం కూడా భారీ స్పందనను నమోదు చేసింది. దీంతో దక్షిణ భారతదేశ యువతలో తిరుపతి అత్యంత ప్రాధాన్యమైన పుణ్యక్షేత్రంగా నిలిచింది. తిరుపతి తర్వాత రిషికేశ్, తంజావూరు, వారణాసి(కాశీ), ఉజ్జయిని, నాందేడ్ వంటి ప్రాంతాలు యువ యాత్రికుల మన్ననలు పొందుతున్నాయి. ముఖ్యంగా యోగా, ధ్యానానికి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రిషికేశ్‌కు వెళ్లిన వారిలో 59 శాతం మంది జెన్ జి యువతే కావడం విశేషం. మిలీనియల్స్‌ను కలుపుకుంటే దాదాపు మొత్తం సందర్శకుల్లో యువతరమే అధికంగా కనిపించింది. అలాగే చెన్నై?తంజావూరు, ఇండోర్?ఉజ్జయిని మార్గాలు కూడా యువ ప్రయాణికుల ఆదరణను పొందాయి. ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయానికి 2025 డిసెంబర్ చివరి వారం నుంచి 2026 జనవరి ప్రారంభం వరకు 12 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. వారణాసి, పూరీ, అమృత్‌సర్, హరిద్వార్ వంటి సంప్రదాయ ఆధ్యాత్మిక కేంద్రాలు కూడా యువతతో కిటకిటలాడుతున్నాయి. వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయానికి 2026 నూతన సంవత్సర రోజునే ఐదు లక్షల మందికి పైగా భక్తులు చేరుకోవడంతో క్యూలు మూడు కిలోమీటర్ల మేర విస్తరించాయి. మరోవైపు అయోధ్యలో రామ మందిర ప్రభావంతో సందర్శకుల సంఖ్య భారీగా పెరిగింది. పూరీ జగన్నాథ ధామ్‌లో కూడా యాత్రికుల రద్దీ రికార్డు స్థాయికి చేరుకుంది. మొత్తం మీద, ఈ కార్యక్రమాలు ఆప్‌కు హిందూ ఓట్లు తెచ్చే అవకాశం ఉందా లేదా అనేది ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తెలుస్తుంది. రాజకీయాల్లో "సెక్యులరిజం" అనేది చాలా సార్లు సందర్భానుసారం మారిపోతుందని ఈ సంఘటన మరోసారి నిరూపిస్తోంది.

# సీబీఎస్ఈలో త్రిభాష విధానం

**న్యూఢిల్లీ :** జాతీయ విద్యా విధానం 2020 అమలులో భాగంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (2026–27 విద్యా సంవత్సరం నుంచి కొత్త త్రిభాషా విధానాన్ని అమలు చేయనుంది. ఈ మేరకు భాషా విద్యకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యార్థుల్లో బహుభాషా నైపుణ్యాలను పెంపొందించడం, భారతీయ భాషల పట్ల అవగాహన పెంచడం, విద్యను మరింత ఆచరణాత్మకంగా తీర్చిదిద్దడం ఈ విధానం ప్రధాన లక్ష్యమని బోర్డు వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థులు మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. వీటిలో కనీసం రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా ఉండాలి. మూడవ భాష భారతీయమైనా లేదా విదేశీ భాషైనా కావచ్చు. అయితే మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలై ఉండాలి. 2026–27 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కొత్త త్రిభాషా విధానం వర్తించదు. వారు ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారమే రెండు భాషలతో తమ విద్యను పూర్తి చేయవచ్చు. అదనంగా మూడవ భాషను తీసుకోవాల్సిన అవసరం లేదు. 2026– 27లో 9వ తరగతిలో చేరే విద్యార్థులందరూ మూడు భాషల ను అభ్యసించాల్సి ఉంటుంది. ఇప్పటికే రెండు భారతీయ భాషలను చదువుతున్న విద్యార్థులు తమ మూడవ భాషగా ఇంగ్లీష్, ఫ్రెంచ్ లేదా ఇతర భాషలను ఎంచుకోవచ్చు. ఒక భారతీయ భాష, ఒక విదేశీ భాష చదువుతున్నవారు మాత్రం మూడవ భాషగా తప్పనిసరిగా మరో భారతీయ భాషను ఎంపిక చేసుకోవాలి. రెండు విదేశీ భాషలను చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపు కల్పించినప్పటికీ, అదనంగా ఒక భారతీయ భాషను తప్పనిసరిగా నేర్చుకోవాల్సి ఉంటుంది.





### మూడవ భాషకు బోర్డు పరీక్ష ఉండదు

9వ తరగతి విద్యార్థులకు మూడవ భాషకు సంబంధించిన మూల్యాంకనం పాఠశాల స్థాయిలోనే నిర్వహించబడుతుంది. 10వ తరగతికి చేరుకున్న తర్వాత కూడా ఆ భాషకు సంబంధించి బోర్డు పరీక్ష ఉండదని స్పష్టం చేసింది. దీనికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, అధ్యయన సామగ్రిని అందించనున్నాయి. ప్రస్తుతం 6, 7, 8వ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో 9వ, 10వ తరగతులకు చేరుకున్నప్పుడు త్రిభాషా విధానం పూర్తిగా అమల్లోకి వస్తుంది. 2026–27లో 6వ తరగతి మరియు అంతకంటే తక్కువ తరగతుల విద్యార్థుల కోసం భవిష్యత్తులో మూడవ భాషకు సంబంధించిన బోర్డు పరీక్షను కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపింది. చట్టం–2016 ప్రకారం దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిం చనున్నారు. విదేశాల్లోని పాఠశాలల విద్యార్థులు, విదేశాల నుంచి భారతదేశానికి తిరిగి వచ్చే విద్యార్థులకు మూడవ భారతీయ భాష నుంచి మినహాయింపు ఇవ్వబడుతుంది. అలాగే తల్లిదండ్రుల బదిలీల కారణంగా రాష్ట్రాలు మారిన విద్యార్థులు తమ పాత భాషా విధానాన్ని కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది. కొత్త విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించింది. అలాగే ఆన్‌లైన్, హైబ్రిడ్ బోధన విధానాలను కూడా ఉపయోగిం చుకునేందుకు పాఠశాలలకు అనుమతి ఇచ్చింది. విద్యార్థులపై అదనపు పరీక్షల భారం మోపడం తమ ఉద్దేశం కాదని, భారతీయ భాషలతో వారిని అనుసంధానించి బహుభాషా నైపుణ్యాలను పెంపొందించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమనిస్పష్టం చేసింది.

# వందేళ్లలో మూడోసారి కరువు

## జూలై రెండో వారం నుంచి వానలు పడే అవకాశం

**న్యూఢిల్లీ :** గడిచిన వందేళ్లలో జూన్ నెలలో అత్యల్ప వర్షపాతం నమోదవ్వడం ఇది మూడోసారి. 1927 – 2026 మధ్య 2009లో 87.5 మిల్లీ మీటర్లు, 2014లో 92.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మూడు అత్యల్ప వర్షపాతాలు కూడా ఇరవై ఏళ్లలోనే నమోదవ్వడం విశేషం. ముఖ్యంగా మధ్య భారతదేశంలో వర్షపాతం లోటు అత్యధికంగా 54 శాతం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ లక్షణాలు అన్నీ చూస్తుంటే ఎల్‌నినో పరిస్థితులను చూయిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వర్షాకాలం మొదలైనా దేశంలో ఎక్కడా చినుకు జాడే కనిపించలేదు. గత వందేళ్లలో జూన్‌లో ఇంత తక్కువ వర్షపాతం నమోదవ్వడం ఇది మూడోసారి. భారత వాతావరణశాఖ గణాంకాల ప్రకారం జూన్ నెలలో 42 శాతం లోటు వర్షంపాతం నమోదైంది. 1927 – 2026 మధ్య జూన్‌లో ఇంత తక్కువ వర్షపాతం నమోదవ్వడం ఇది మూడోసారి. జూన్ నెలలో దేశవ్యాప్తంగా సాధారణంగా 157.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవ్వాలి. కానీ ఇప్పటి వరకు కేవలం 92.2 మిల్లీ మీటర్ల వర్షపాతమే నమోదైంది. ఒకవేళ నెలాఖరు రోజున వర్షాలు కురిసినా 100 మిల్లీ మీటర్ల వద్దే ఆగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దాంతో ఈ ఏడాది జూన్ నెలలోనే కరువు ఛాయలు కనిపిస్తున్నాయని, ఎల్‌నినో ప్రభావం అప్పుడే మొదలైందా అని అందరూ అనుకుంటున్నారు. గత శతాబ్దంలో జూన్ నెలలో 92.2 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వర్షపాతం రెండు సార్లు నమోదైంది. 2009లో 87.5 మిల్లీ మీటర్లు, 2014లో 92.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ రెండూ కూడా గత 20 ఏళ్లలోనే రావడం గమనార్హం. దీన్ని బట్టి వర్షపాతం ఏటికేడు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.



దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ లోటు వర్షపాతం నమోదైనా అత్యధిక లోటు మాత్రం మధ్య భారతదేశంలోనే. మధ్య భారతంలో 54 శాతం లోటు ఉంటే.. తూర్పు, ఈశాన్య భారతంలో 41 శాతం లోటు, వాయువ్య భారతంలో 30 శాతం లోటు, దక్షిణ భారతంలో 28 శాతం లోటు వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. దేశంలోని నాలుగు ప్రధాన ప్రాంతాల్లో ఒకేసారి ఇంత భారీ వర్షాభావం నమోదవడం అరుదైన విషయమని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావమే ప్రధాన కారణమై ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం మోస్తరు స్థాయికి చేరువవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడుతున్నాయని అంచనా వేస్తున్నారు. అయితే, భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూలై తొలి వారంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో వర్షాభావ పరిస్థితి కొద్దిమేర తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది

# రెండు రాష్ట్రాలకు కొత్త సీఎంలు

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం మంత్రివర్గంలోనే కాదు.. మొత్తంగా బీజేపీలోనూ సంస్థాగత మార్పులు చేయనుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల తర్వాత పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను ప్రస్తుత బాధ్యతల నుంచి పక్కన పెట్టే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత వ్యవహారాలను, ఎన్నికల వ్యూహాలను శాసిస్తున్న ఆయనను తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు పంపేందుకు తెరవెనుక ముమ్మర కసరత్తు జరుగుతోందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ సంస్థాగత మార్పులతో పాటు, కీలక రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులను కూడా మార్చాలని పార్టీ అగ్రనాయకత్వం ఒక ఖచ్చితమైన ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో తలెత్తిన పరిణామాలు, ప్రభుత్వాల ఇమేజ్ డ్యామేజ్ కావడంపై కేంద్ర పెద్దలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాల పనితీరును గాడిలో పెట్టడమే కాకుండా, రాబోయే సవాళ్లను తట్టుకునేలా కొత్త నాయకత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా ఈ మార్పులు ఉండబోతున్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబం చుట్టూ ముసురుకున్న భారీ భూ కుంభకోణం పణలు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. ఉజ్జయిని పరిసర ప్రాంతాలలో ముఖ్యమంత్రి కుటుంబ



సభ్యులు మరియు, రియల్ ఎస్టేట్ సంస్థలు వందలాది ఎకరాల భూస్కామ్‌కు పాల్పడ్డాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఉజ్జయిని భూ వ్యవహారం "మహాకాల్ భూమి దోపిడీ"గా రాజకీయంగా తీవ్ర దుమారం రేపడం, జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా మారడంతో ముఖ్యమంత్రి మార్పు ఖాయమనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరోవైపు, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పనితీరుపై కూడా అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన హయాంలో పరిపాలనా లోపాలు, వివాదాస్పద నిర్ణయాలు, పార్టీ శ్రేణులతో సమన్వయ లోపం వంటి అంశాలపై జాతీయ నాయకత్వానికి నివేదికలు అందాయి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకుండా ముందస్తు జాగ్రత్తగా అక్కడ కూడా సమర్థుడైన నాయకుడికి పగ్గాలు అప్పగించాలని మోదీ–షా ద్వయం భావిస్తోంది

# రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించేది ఎప్పుడు?

**2018 సెప్టెంబర్ లో అనుమతి ఇచ్చిన కేంద్రం**

**అనువైన స్థలం చూపించని గత, నేటి ప్రభుత్వాలు**

**2025 జనవరిలో కొత్త నిబంధన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చిన కదలని జిల్లా యంత్రాంగం**




**గోదావరిఖని:** పెద్దపెల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వంద పడకల ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణం ముందుకు సాగడంలో అలసత్వం ఎందుకు జరుగుతుందని రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బుధవారం రోజున నిరసన తెలుపడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం రామగుండం స్వచ్ఛంద సంఘాల అధ్యక్షులు మద్దెల దినేష్ ఉపాధ్యక్షులు ×గోలివాడ చంద్రకళ లు మాట్లాడుతూ 2018 లోనే హాస్పిటల్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి లభించినప్పటికీ గత బిఆర్ఎస్ సర్కార్ అనునువైన స్థలం చూపించలేదని తదనంతరం 2022లో సమాధుల పక్కన చెత్త డంపింగ్ యార్డ్ స్థలాన్ని చూపించారని ఈ స్థలానికి రోడ్డు కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఈఎస్ఐ అధికారుల బృందం రిజెక్ట్ చేయడం జరిగిందనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 2023లో వచ్చిన ఈఎస్ఐ కొత్త నిబంధన ప్రకారం అనువైన స్థలాన్ని ఎంపిక చేయగా 2025 జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందన్నారు. ఇప్పటివరకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం దీని నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఆసుపత్రి నిర్మాణం కాకపోవడంతో అసంఘ టిత కార్మికులు వారి కుటుంబాలు తీవ్ర నిరాశలో ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఒక సంస్థలో 10 మంది అంతకంటే ఎక్కువ మంది పని చేస్తే వారికి ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఈ.ఎస్.ఐ వర్తింపజేస్తారని వారు పేర్కొన్నారు. కార్మికుడు పొందే వేతనం లో 0.75 శాతం కార్మికుడి నుంచి 3.25 శాతం మేనేజ్మెంట్ నుంచి కలిపి మొత్తం నాలుగు శాతం ఈ.ఎస్.ఐ కి జమ చేస్తారని, వేతనం లో ఈ.ఎస్.ఐ క్రింద డబ్బులు జమచేసి కార్మికుడికి వారి కుటుంబ సభ్యులకు ఈ.ఎస్.ఐ హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తారు. ఈఎస్ఐ రామగుండం బ్రాంచి పరిధిలో ఐదు జిల్లాలు వస్తాయని పెద్దపల్లి, మంచిర్యాల్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన సుమారు 60000 మందికి పైగా కార్మికులు వస్తారని వీరిలో ఈ.ఎస్.ఐ డబ్బులు చెల్లించే ఎన్టిపిసి, ఆర్.ఎఫ్.సి.ఎల్, సింగరేణి, సిమెంట్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు షాపింగ్ మాల్స్, మున్సిపల్ కార్మికులు, బీడీ కార్మికులు ,వీవింగ్ మిల్లు కార్మికులకు వైద్య సేవలు అందించాలన్నారు. ఇందుకోసం రామగుండం ఎన్టీపీసీ, బసంత్ నగర్ మంచిర్యాలలో మాత్రమే ఈఎస్ఐ డిస్పెన్సరీలు కొంత నడుస్తున్నాయని, జగిత్యాల సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు చెందిన కార్మికులు ఎక్కడ కూడా ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేయకపోవడంతో వారు వైద్య సేవలకు నోచుకో వడం లేదన్నారు. ఒకవేళ ఈ జిల్లాలకు చెందిన వారు వైద్యం పొందాలంటే బసంత్ నగర్ లేక ఎన్టిపిసి వరకు వ్యయప్రయాసాలు కోర్చి వెళ్లక తప్పడం లేదన్నారు. పెద్ద జబ్బులు వస్తే వరంగల్,నాచారం సనత్ నగర్ లోని హాస్పిటల్ మరియు ఈఎస్ఐ హాస్పిటల్ లకు రిఫరల్ మీద వెళ్తున్నారన్నారు. గతంలోనే ఐదు ఎకరాల స్థలం ఉంటేనే ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించవచ్చని నిబంధనలు మార్పు చేసి 2023లో కొత్త నిబంధనలు తీసుకొచ్చారని రామగుండం పట్టణంలో మూడు ఎకరాల 30 గుంటల స్థలం ఉంటె చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 లో జనవరి 8న ఈ.ఎస్.ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనుమతించిందని ఇప్పటికీ ఏడాది దాటిన జిల్లా అధికార యంత్రాంగం రామగుండం ఈ.ఎస్. ఐ హాస్పిటల్ నిర్మాణం విషయంలో ఎందుకు ముందుకు కదలడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి కోసం నిధులు విడుదల చేసినా జిల్లా అధికార యంత్రాంగం ఎందుకు నిర్లక్ష్యం చేస్తూ అసంఘటిత కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని వారు విమర్శించారు. రామగుండంలో చుట్టు ప్రక్క ప్రాంతాల వేలాది మంది కార్మికులు ఉన్నప్పటికీ ప్రాథమిక హెల్త్ సెంటర్లు మినహా ఎలాంటి మెరుగైన వైద్య సదుపాయాలు లేక అనారోగ్య బాధపడే కార్మికులు హైదరాబాదు లాంటి దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చి ఇబ్బంది పడుతున్నారని, కావున రామగుండంలో త్వరితగతిన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లేనియెడల రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఏకం చేసి పోరాడుతుందని ప్రజా ప్రతినిధులను ప్రభుత్వాన్ని అధికారుల ను వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపిన కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేత ఏం. గౌస్, వై. లెనిన్ అలాగే స్వచ్ఛంద సంఘాల సభ్యుల కంకటి రవి, బిళ్ళ శ్రీదేవి సరిత లక్ష్మి, కొండూ రమాదేవి, కె. సుశీల, ఇమ్మడి శారద, మేకల శోభా, మండల శ్రీనివాస్, నజీర్, వికాస్ తో పాటు తదితరుల పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసు పత్రిలో ఉచిత ఎమ్మార్ఐ సేవలు ప్రారంభం

**పేద ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**




**జయశంకర్ భూపాలపల్లి :** పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంయుక్తంగా ప్రారంభించారు. కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం యంత్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, మారుమూల జిల్లాగా ఉన్న జయశంకర్ భూపాలపల్లిలో అత్యాధునిక ఎమ్మారై సేవలు ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఆస్పత్రిలో రోగుల అవసరాల కోసం వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఆస్పత్రిని 100 పడకల నుంచి 300 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ.14 కోట్ల వ్యయంతో నాలుగో అంతస్తు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే గుండె సంబంధిత చికిత్సల కోసం క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తరహాలో ఇతర బ్యాంకులు కూడా తమ సిఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, "డాక్టర్స్ ఫర్ యూ" సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజీఎం ఆసు పత్రి తర్వాత ప్రభుత్వ రంగంలో ఎమ్మారై యంత్రం ఏర్పాటు చేసిన ఆసు పత్రిగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలవడం గర్వకారణమన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై సేవల నిర్వహణ కోసం ఇద్దరు నిపుణులైన ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్, హనుమకొండకు తరలించాల్సి వచ్చేదని, ఇకపై భూపాలపల్లిలోనే ఉచిత ఎమ్మారై పరీక్షలు అందుబాటులో ఉండడంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే భూపాలపల్లి జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఆస్పత్రికి ఎమ్మారై యంత్రాన్ని అందించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, హెచ్ డీ ఎఫ్ సి క్లస్టర్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ గోవింద క్షేత్రంలో అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగింపు

**నాగర్ కర్నూల్ :** ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విశేష పూజలు, హోమాలు, కళ్యాణోత్సవం, పల్లకి సేవలు ఘనంగా నిర్వహణ వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనడం అన్నప్రసాదం, తీర్థప్రసాదాల వితరణలో భక్తుల భారీ పాల్గొనడం బ్రహ్మోత్సవాల విజయానికి సహకరించిన అందరికీ ఆలయ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ కృతజ్ఞతలు అర్చకులు, దాతలు, భక్తులు, కమిటీ సభ్యులు, సేవకులకు ప్రత్యేక ధన్యవాదాలు మీడియా, పోలీసు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్ ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి కృప ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థన

## ఎస్‌బిఐ లైఫ్ బీమా చెక్కు పంపిణీ

**నామినీకీ చెక్కు అందజేసిన ఎస్‌బిఐ లైఫ్ బిజినెస్ మేనేజర్ పల్లికొండ రాజేందర్**



**జగిత్యాల :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన ఐత్త సుప్రియ అనే వ్యక్తి గత కొద్ది రోజుల క్రితం మృతిచెందారు . మృతురాలు సుప్రియ ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్సులో సరల్ స్వధన్ ప్లస్ పాలసీని రూ. 5 వేల ప్రీమియంతో తీసుకున్నారు. కేవలం మూడు ప్రీమియంలు చెల్లించిన సుప్రియ మృతిచెందగా వారి కుటుంబానికి ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ. (4,75,000/-) నాలుగు లక్షల డెబ్బై ఐదువేలు బీమా చెక్కును బుధవారం బిజినెస్ మేనేజర్ పల్లికొండ రాజేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ లైఫ్ డివిజనల్ మేనేజర్ ముడం గణేష్, సీనియర్ అడ్వైసర్ కాపెరపు సత్తయ్య-రవిత మరియు దొంతాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తాసిల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు:



**రామడుగు:** రామడుగు మండల నూతన తాసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన దాసరి రాజు ను రామడుగు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్ సర్పంచు లు ధ్యావ అనంతరెడ్డి వీర్ల నర్సింగరావు నరేందర్ రెడ్డి ఎండి మొహిజ్ అంజన్ కుమార్ కత్తి మధు ఈశ్వర్ ఉపసర్పంచులు. మనీష్ బండారి పరశురాములు, అరుణ్ భగత్ నాయకులు పంజాల శ్రీనివాస్ భువన్ కుమార్ స్వామి బాబు పూసాల వేణు బిట్టు మడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దులపల్లి లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్..

**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి, మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి, పలిమెల ఎస్సై శశాంక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత మత్తుకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. గ్రామంలో గుడుంబా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, గుడుంబా అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వెంటనే లైసెన్స్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్ వద్ద పోలీసుల కాల్పులు

**హైదరాబాద్ :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మంగళవారం కాల్పులు కలకలం రేపాయి. నల్గొండ జిల్లా కేంద్రంతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఒక నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు నల్గొండ సీసీఎస్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసుల బృందం అతడిని పట్టుకునేందుకు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఆదిభట్ల పరిసరాల్లోని హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు వారిపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలోనే పోలీసులు ఆత్మరక్షణ కోసం అతడిపై కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో గాయపడిన నిందితుడిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో నిందితుడిపై నాలుగేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను హత్య చేసిన కేసులో ఇతడు ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు సమాచారం. పదికి పైగా దొంగతనాల కేసులు ఉన్నట్లు తేలింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**పోలీసుల పై కత్తితో దాడికి యత్నం..**

**ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు**

సోమవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో శ్రీకాంత్ ౦ఖ 39 ఎః 6640 నంబర్ గల డీసీఎం ఐషర్ వాహనంలో ఇబ్రహీంపట్నం నుంచి బొంగులూరు వైపు ఫస్ట్ సర్వీస్ రింగ్ రోడ్ మీదుగా వెళ్తున్నాడు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీసీఎస్ నల్గొండ పోలీసులు అనుమానంతో వాహనాన్ని ఆపి చెక్ చేయబోతే.. నిందితుడు తన వద్ద ఉన్న కత్తితో పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా, రెండు బుల్లెట్లు నిందితుడి కాళ్లకు తగిలాయని పోలీసులు తెలిపారు. గాయపడిన శ్రీకాంత్ ను వెంటనే 108 అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి చేరుకున్న నల్గొండ సీసీఎస్ పోలీసులు నిందితుడిని నల్గొండకు తరలించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించాక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై గతంలో ఉన్న ఆస్తి నేరాల కేసుల వివరాలు సేకరిస్తున్నారు.

## గాంధీ ఆసుపత్రిలో డాక్టర్స్ డే

**సికింద్రాబాద్ :** డాక్టర్స్ డే సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ లో సూపరింటెండెంట్ డా. వాణితో పాటు హెచ్ ఓ డీ లు, సీనియర్ వైద్యులను మాజీ కార్పొరేటర్ ఏల్చురి సావిత్రి మహేష్ ఆధ్వర్యంలో స్థానిక నేతలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు రోగులకు అందిస్తున్న సేవలను గురించి కొనియాడారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వాణి మాట్లాడుతూ ఈ సన్మానాలు, సత్కారాలు వైద్యుల సేవలకు గుర్తింపే కాకుండా మరింత ఉత్సాహంగా పనిచేయడానికి పునరుత్తేజాన్ని ఇస్తాయని, మా బాధ్యతను మరింత పెంచుతాయని తెలిపారు. గాంధీ ఆసుపత్రి ప్రతిష్టను మరింత పెంచడానికి అన్ని విభాగాల వైద్యులు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది అందరం కలసి సమిష్టిగా కృషి చేస్తామని వెల్లడించారు. వైద్యులందరికి వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

**కమాన్ పూర్ :** కమాన్ పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ పి విజయకుమార్ చే కేక్ కట్ చేయించి స్వీట్ తినిపించి సన్మానించడం జరిగినది . ఈ సందర్భంగా పలువురికి పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ ,కోశాధికారి డాక్టర్ విజయకుమార్, లైన్స్ క్లబ్ క్లబ్ డైరెక్టర్ కోలేటి మారుతి , సీనియర్ జర్నలిస్టు లయన్ జబ్బార్ ఖాన్ , బొజ్జ రాజసాగర్ ముకుంద రాజన్న చోడవరపు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు

**హైదరాబాద్ :** యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన కార్యవర్గ ఏర్పాటుకు సంబంధించి తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని సొంత కాంగ్రెస్ ప్రభుత్వంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం యాదాద్రి జిల్లాలోనే ఉన్నప్పటికీ తనకు సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన నేరుగా విమర్శలు గుప్పించారు. రేవంత్‌కు షోఆఫ్స్ ఎక్కువయ్యాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఎమ్మెల్యేనైన తనను సంప్రదించి ఉంటే తన నియోజకవర్గం నుంచి ఒక సభ్యుడినైనా బోర్డులో చేర్పించుకునేవాడినని, కనీస ఇంగితజ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఏకపక్ష పోకడలు నచ్చకనే నల్గొండలో జరిగిన ముఖ్యమంత్రి సభకు తాను వెళ్లలేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నా తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. అసలు కాంగ్రెస్‌లో ఒరిజినల్ కాంగ్రెసోళ్లు ఎక్కడున్నారని, ఎక్కడెక్కడి నుంచో కొత్తవాళ్లు వచ్చి అంతా వాళ్లే నడుపుతున్నారని దుయ్యబట్టారు. సీనియర్లను ఎలా గౌరవించాలో కూడా తెలియడం లేదని, నాడు తెలంగాణ కోసం కొట్లాడిన ఒరిజినల్ లీడర్లు రోజురోజుకీ కనుమరుగవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రేవంత్, భట్టి తలో మాట చెబుతున్నారు

**హైదరాబాద్ :** శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో అన్నదాతల అసలు సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. ఒకే సభలో పక్కపక్కనే కూర్చున్న రేవంత్, భట్టి విక్రమార్క వేర్వేరు లెక్కలు చెప్పారని హరీశ్ ఎద్దేవా చేశారు. రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని భట్టి విక్రమార్క చెబితే... రేవంత్ రెడ్డి ఏకంగా రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పారని... అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమో చెప్పాలని నిలదీశారు. 2027 మార్చి వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, 2026 జూన్ నాటికే లక్షన్నర కోట్లకు పైగా ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో షరతులు లేని రూ.2 లక్షల రుణమాఫీ అని ఓట్లు దండుకుని, తీరా అధికారంలోకి వచ్చాక కేవలం స్వల్పకాలిక రుణాలకే అది వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను నిలువునా ముంచడమేనన్నారు. ఇకనైనా ఫేక్ ప్రచారాలు ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో అన్నదాతలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులను సన్మానించిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

**గోదావరిఖని :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ాఎటూ మెడికల్ కాలేజీ యాజమాన్యం ఆహ్వానం మేరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కేక్ కట్ చేసి వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. అలాగే మెడికల్ విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్యాభ్యాసం, లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో కష్టపడి చదువుకుని ప్రజలకు సేవ చేసే గొప్ప వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, వారి అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు పేర్కొన్నారు.

# భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు పునఃప్రారంభించాలి



భారత్– పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించి, ద్వైపాక్షిక చర్చల్ని తిరిగి ప్రారంభించాలని ఇరు దేశాలకు చెందిన దాదాపు 100 మందికిపైగా ప్రముఖులు సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం ఘర్షణలకు బదులుగా సంభాషణ, సహకార మార్గాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు. రెండు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య, రవాణా సంబంధాల్ని మునుపటిలా సాధారణ స్థితికి తీసుకురావాలని అభ్యర్థిం చారు. జూన్ 30వ తేదీతో విడుదలైన ఈ బహిరంగ లేఖపై భారత్‌కు చెందిన 61 మంది, పాకిస్థాన్‌కు చెందిన దాదాపు 55 మంది ప్రముఖులు సంతకాలు చేశారు. సెంటర్ ఫర్ పీస్ ప్రోగ్రెస్ ఛైర్మన్ ఓపీ షా సమన్వయంతో ఈ లేఖను రూపొందించారు. ఇక ఈ లేఖపై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, మాజీ రా – భారత గూఢచార సంస్థ) చీఫ్ ఏఎస్ దులత్, రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్, మితవాద వేర్పాటువాద నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫరూక్, పాకిస్థాన్ మాజీ విదేశాంగ శాఖ మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ, మాజీ దౌత్యవేత్త అష్రఫ్ జహంగీర్ ఖాజీతో పాటు పలువురు మాజీ రాయబారులు, పౌర సమాజ ప్రతినిధులు సంతకాలు చేశారు.

**‘చర్చలే సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం’– లేఖలో ప్రముఖులు**

ఈ సందర్భంగా భారత్, పాక్ మధ్య విభేదాల్ని పరిష్కరిం చేందుకు నిరంతర ద్వైపాక్షిక చర్చలే ఏకైక మార్గమని లేఖలో వారు పేర్కొన్నారు. దక్షిణాసియాలో శాంతిని నెలకొల్పడం, పరస్పర సహకారాన్ని పునరుద్ధరించడం, సాధారణ పరిస్థితులకు తీసుకొచ్చేందుకు రెండు దేశాల ప్రభుత్వాలు అర్థవంతమైన, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించాలని, హైకమిషనర్లను తిరిగి నియమించాలని, సాధారణ వీసా సేవల్ని కూడా పునఃప్రారంభించాలని లేఖలో సూచించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అన్ని ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు ప్రారంభించాలని కోరారు.


**‘సైనిక ఉద్రిక్తతలు తగ్గించేలా చర్యలు చేపట్టాలి’**

జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన అన్ని అంశాలపైనా చర్చలు కొనసాగించాలని ఆ ప్రముఖులు లేఖలో పేర్కొన్నారు. 2004 నుంచి 2007 వరకు ఇరు దేశాలు చర్చించిన అంశాల్ని మరోసారి పరిశీలించాలని సూచించారు. ఇరు దేశాల భద్రతా ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని సైనిక ఉద్రిక్తతల్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. లేఖలో పేర్కొన్న ఇతర అంశాలు చూస్తే– ‘భారత్ పాకిస్థాన్ మధ్య వాణిజ్య సంబంధాలు తిరిగి ప్రారంభించాలి. అట్టారీ వాఘా సరిహద్దు వాణిజ్య మార్గాన్ని తిరిగి తెరవాలి. దిల్లీ– లాహోర్ బస్సు సర్వీస్, శ్రీనగర్– ముజఫరాబాద్ బస్సు సర్వీస్, సంజౌతా ఎక్స్‌ప్రెస్, థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని పునరుద్ధరించాలి. కార్గిల్ స్కార్దూ మార్గాన్ని తెరవాలి. కమర్షియల్ ఫ్లైట్స్ తిరిగేందుకు వీలుగా ఇరు దేశాలు గగనతలాల్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలి’ అని విజ్ఞప్తి చేశారు.

**200 కోట్ల మంది సంక్షేమం, ఆశయాల కోసమే**

ఇదే సమయంలో కర్తార్‌పుర్ సాహిబ్ కారిడార్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని, శారదా పీఠాన్ని యాత్రికుల కోసం తెరవాలని లేఖలో సూచించారు. ‘దక్షిణాసియా భవిష్యత్తు– విభేదాలు, ఘర్షణలతో కాకుండా శాంతి, అభివృద్ధి, పరస్పర సహకారంతో ముందుకు సాగాలి’ అని పేర్కొన్నారు. చివరగా ఇది ఏ రాజకీయ వైఖరికి మద్దతుగా రాసిన లేఖ కాదని, దాదాపు 200 కోట్ల మంది ప్రజల సంక్షేమం, ఆశయాల్ని దృష్టిలో పెట్టుకొని చేసిన విజ్ఞప్తి మాత్రమేనని స్పష్టం చేశారు. భారత్– పాకిస్థాన్ జనాభాలో అధిక శాతం యువతేనని, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల లక్షలాది మంది యువత ఉపాధి, విద్య, వ్యాపారం, అభివృద్ధి అవకాశాల్ని కోల్పోతున్నారని పేర్కొన్నా రు. అందుకే ఘర్షణకు బదులుగా సహకారం, శత్రుత్వానికి బదులు సంభాషణ, ఒంటరితనానికి బదులుగా పరస్పర భాగస్వామ్యాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు.

# 30 రోజులు జైల్లో ఉంటే పదవి ఊడినట్టే!



**ఢిల్లీ:** రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఒక కీలక బిల్లును తీసుకురానుంది. అదే 130వ రాజ్యాంగ సవరణ బిల్లు. ఈ కొత్త చట్టం ప్రకారం.. ఏదైనా తీవ్రమైన క్రిమినల్ లేదా అవినీతి కేసులో అరెస్టయి, వరుసగా 30 రోజులకు మించి జైల్లో ఉంటే సదరు ప్రజాప్రతినిధి తన పదవిని కోల్పోతారు. రాజకీయాల్లో అవినీతిని అరికట్టేందుకు తెస్తున్న ఈ చట్టం.. దేశ ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలందరికీ వర్తిస్తుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈ సమావేశాల ప్రారంభంలోనే తన నివేదికను సభకు సమర్పించనుంది. జేపీసీ నివేదికను పరిశీలించిన తర్వాత, ఈ బిల్లును ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంట్ ముందుకు తెస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో, ఇది చట్టంగా మారాలంటే పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం అవుతుంది పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ప్రారంభమై ఆగస్టు 21 వరకు జరగనున్నాయి.కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ సమావేశాలకు సంబంధించిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కారణంగా ఆగస్టు 13, 14 తేదీల్లో సభకు సెలవు ఉంటుంది. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు పలు కీలక బిల్లులు ఈ సమావేశాల్లోనే చర్చకు రానున్నాయి.

# భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్న భార్యకు ‘తాత్కాలిక భరణం’ పొందే హక్కు లేదు

**‘భార్య ఆర్థికంగా స్థిరపడితే తాత్కాలిక భరణం ఇవ్వక్కర్లేదు’ కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు**



ఓ భార్యాభర్తల వివాదం కేసు విషయంలో కర్ణాటక హైకోర్టు మంగళవారం కీలక తీర్పు ఇచ్చింది. ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటూ, భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్న భార్యకు ‘తాత్కాలిక భరణం’ పొందే హక్కు లేదని స్పష్టం చేసింది. భార్యకు నెలకు రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులకు 2024లో వివాహం అయ్యింది. కానీ వైవాహిక విభేదాల కారణంగా కొన్ని నెలల తర్వాత విడివిడిగా జీవించడం ప్రారంభించారు. ఆ తర్వాత భార్య భరణం కోరుతూ దిగువ కోర్టును ఆశ్రయించింది. విచారణ సమయంలో, భర్త నెలవారీ జీతం రూ.60,646కాగా, భార్య నెలకు రూ.1 లక్ష సంపాదిస్తున్నట్లు తేలింది. అయినప్పటికీ భర్త ప్రతి నెలా రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలని దిగువ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాన్ని సవాల్? చేస్తూ భర్త కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్?ను జస్టిస్? చిల్లాకూర్? సుమలత అనుమతించారు. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్త ఎల్లప్పుడూ భార్యకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలనే లింగ–ఆధారిత అంచనాలు ఆధారంగా తీర్పులు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. ముఖ్యంగా భార్య ఆర్థికంగా సురక్షితంగా ఉండి, ఎలాంటి సాయం అవసరం లేనప్పుడు తాత్కాలిక భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇలాంటి ప్రతి కేసుకు సంబంధించి పూర్తి వాస్తవాలు, పరిస్థితులను నిశితంగా పరిశీలించిన తర్వాతే భరణంకు సంబంధించిన ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టు తేల్చిచెప్పింది. భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉండి, భర్త కంటే ఎక్కువ సంపాదిస్తూ, పిల్లల సంరక్షణ లాంటి అదనపు బాధ్యతలు లేనప్పుడు భరణం ఇవ్వాల్సిన అవసరం ఏముంది? భార్యను పోషించడం భర్త బాధ్యత అనే భావనతో మాత్రమే భరణం చెల్లించాలని కోర్టులు ఆదేశించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భర్త ఎల్లప్పుడూ భార్యను పోషించాలనే సంప్రదాయ భావనలకు లోనుకావద్దని ఫ్యామిలీ కోర్టుకు సూచించింది. భార్య– తనను తాను పోషించుకోవడానికి అవకాశం లేదని, స్వతంత్ర ఆర్థిక వనరులు లేవని నిరూపించుకున్నప్పుడు మాత్రమే తాత్కాలిక భరణాన్ని లేదా తుది భరణాన్ని మంజూరు చేయాలని హైకోర్టు పేర్కొంది.

“ప్రస్తుత కేసులో భార్య నెలవారీ ఆదాయం ఒక లక్ష రూపాయలు. అది ఆమే స్వయంగా అంగీకరించింది. ఇది ఆమె భర్త నెలవారీ జీతం కంటే ఎక్కువ. దీనిని బట్టి భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉంది. కాబట్టి తనను తాను పోషించుకోగలదు. నెలకు సుమారు రూ.60వేలు జీతం వచ్చే భర్తను, ప్రతినెలా రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలని దిగువ కోర్టు ఆదేశించడం సరికాదు. అలాంటి ఆదేశం చట్టబద్ధంగా చెల్లదు” అని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ తీర్పు కేవలం ‘తాత్కాలిక భరణం’ అంశానికి మాత్రమే పరిమితమని, పెళ్లి వివాదానికి సంబంధించిన తుది తీర్పుపైగానీ, భరణంపై తీసుకునే తుది నిర్ణయంపై గానీ దీని ప్రభావం ఉండదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. కాగా ఈ కేసులో, భార్య ఆర్థికంగా స్వయంసమృద్ధిగా ఉంది, పైగా భర్త కంటే చాలా ఎక్కువ సంపాదిస్తున్నది కాబట్టి, తాత్కాలిక భరణాన్ని మంజూరు చేయలేమని పేర్కొంటూ దిగువ కోర్టు ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది.

నోట్: ఇంటరిమ్ మెయింటెనెన్స్ అంటే మధ్యంతర భరణం లేదా తాత్కాలిక నిర్వహణ ఖర్చు అని అర్థం. విడాకులు లేదా భరణం కేసు కోర్టులో నడుస్తున్నప్పుడు, ఈ కేసు పూర్తిగా ముగిసేలోపు ఆర్థికంగా వెనుకబడిన జీవిత భాగస్వామికి కోర్టు మంజూరు చేసే తాత్కాలిక ఆర్థిక సాయాన్ని ఇంటరిమ్ మెయింటెనెన్స్? అంటారు.

## సింధు నది సంక్షోభం



పాకిస్థాన్‌లోని సింధు నదీ పరీవాహక ప్రాంతంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి బాహ్య కారణాల కంటే దేశీయంగా ఉన్న నిర్లక్ష్యం, అసమర్థ నిర్వహణ, మౌలిక సదుపాయాల వైఫల్యాలే ప్రధాన కారణమని తాజా విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి వ్యవస్థల్లో ఒకటైన సింధు బేసిన్, పాకిస్థాన్ ఆహార భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. అయితే, పాలకుల ఉదాసీనత వల్ల ఈ కీలక వ్యవస్థ ప్రస్తుతం పెను ప్రమాదంలో పడింది. దశాబ్దాలుగా సాగునీటి కాలువల నిర్వహణను విస్మరించడం, అవినీతి, ప్రావిన్సుల మధ్య నీటి పంపకాల వివాదాలు ఈ సమస్యను మరింత జఠిలం చేశాయి. అనేక కాలువలకు లైనింగ్ లేకపోవడంతో భారీ స్థాయిలో నీరు వృథా అవుతోంది. మరోవైపు, భూగర్భ జలాల మితిమీరిన వినియోగం, భూములు చౌడుబారడం వంటి సమస్యలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. పటిష్టమైన జాతీయ జల విధానం లేకపోవడం కూడా ఈ దుస్థితికి ప్రధాన కారణంగా మారింది. ఈ నీటి సంక్షోభం రైతులు, మత్స్యకారుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సింధు డెల్టా ప్రాంతంలోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో సాగు భూములు నిస్సారంగా మారాయి. ఫలితంగా, గత కొన్నేళ్లలో లక్షలాది మంది జీవనోపాధిని కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం హిందూకుష్–హిమాలయ ప్రాంతంలో హిమపాతం తగ్గడం వల్ల నదుల్లో ప్రవాహాలు క్షీణించాయి. అయినప్పటికీ, నీటి వృథాను అరికట్టి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు వాతావరణానికి అనువైన పంటలను సాగు చేయడం ద్వారా ఈ సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## భారత్‌కు వెళ్తే ఫోన్ తీసుకెళ్తా.. చైనాకు మాత్రం తీసుకెళ్లను



అమెరికాకు భారత్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశమని, కీలక వ్యూహాత్మక భాగస్వామి అని రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ పేర్కొన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌పై తమకు ఎంతటి నమ్మకం ఉందో వివరించేందుకు ఆయన తన వ్యక్తిగత ఫోన్‌ను ఉదాహరణగా చూపారు. తాను భారత్ పర్యటనకు వెళ్లేటప్పుడు వ్యక్తిగత ఫోన్‌ను వెంట తీసుకెళ్తానని, అదే చైనా పర్యటనకు వెళ్తే మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా దానిని వాషింగ్టన్‌లోనే వదిలి వెళ్తానని ఆయన వెల్లడించారు. యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ, “నేను చైనాకు వెళ్లేటప్పుడు నా ఫోన్ బీజింగ్‌కు తీసుకువెళ్లను. అది వాషింగ్టన్ డీసీలోని నా డెస్క్‌పైనే ఉంటుంది. కానీ నేను ఢిల్లీకి గానీ, భారత్‌లోని మరే ఇతర ప్రాంతానికి గానీ వెళ్లేటప్పుడు నా ఫోన్ ఎప్పుడూ నాతోనే ఉంటుంది. భారత్ అత్యంత విశ్వసనీయమైన మిత్రదేశం అనడానికి ఇదే నిదర్శనం” అని స్పష్టం చేశారు. చైనాతో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా వ్యూహాత్మక ఆలోచనా సరళికి సెనేటర్ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. బీజింగ్‌తో సంబంధాలు ముఖ్యమైనవే అయినప్పటికీ, భారత్‌తో పటిష్టమైన బంధం అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యంత కీలక భాగస్వామిగా భారత్ పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర?



తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందంటూ సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ కుట్రను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం భగ్నం చేసిందని, ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎన్‌డీటీవీ తన కథనంలో పేర్కొంది. ఎన్‌డీటీవీ కథనం ప్రకారం.. విజయ్ పార్టీకి చెందిన ఉతంగరై ఎమ్మెల్యే ఎన్. ఎలైయరాజా ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని, అందుకు రూ.35 కోట్లు ఇస్తామని ఓ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి తనను సంప్రదించాడని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తొలుత చెన్నైలో ఒకరిని, అనంతరం కరూర్‌లో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఈ వ్యవహారానికి డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీతో సంబంధాలున్నట్లు గుర్తించినట్లు ఎన్‌డీటీవీ పేర్కొంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ ఘటనపై స్పందించిన తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్.. సెంథిల్ బాలాజీకి సన్నిహితులే ఈ కుట్రలో ఉన్నారని ఆరోపించారు. విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పలువురు ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆఫర్లు ఇచ్చారని కూడా ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను డీఎంకే ఖండించింది. దర్యాప్తు వివరాలను లీక్ చేసి ప్రజల్లో తప్పుడు ప్రచారం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని డీఎంకే అధికార ప్రతినిధి ఏ. శరవణన్ విమర్శించారు. తమ వద్ద ఆధారాలు ఉంటే సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు.

## బిజినెస్

### వాహనదారులకు ఊరట..
### పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించిన నయారా..!




దేశంలోని వాహనదారులకు నయారా ఎనర్జీ భారీ ఊరట కల్పించింది. పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ.5, డీజిల్‌పై లీటర్‌కు రూ.3 చొప్పున కోత విధించింది. దేశవ్యాప్తంగా ఉన్న 7,000కు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో ఈ తగ్గిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. గత రెండేళ్లలో దేశంలో ఒక ఇంధన రిటైల్ సంస్థ ధరలను తగ్గించడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, కీలకమైన సముద్ర మార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలోనే నయారా ఎనర్జీ పెట్రో ధరల తగ్గింపు నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్రాల వారీగా ఉండే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా తుది రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వరంగ చమురు సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దేశంలోని 90 శాతానికిపైగా ఇంధన మార్కెట్‌ను నియంత్రించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్ ) తమ ధరలలో ఎటువంటి మార్పు చేయలేదు. ఢిల్లీలోని ఐఓసీ బంకుల్లో పెట్రోల్ లీటర్ రూ.102.12, డీజిల్ రూ.95.20 వద్ద స్థిరంగా ఉన్నాయి. కాగా ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో మార్చి 26న నయారా పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచింది. తాజా తగ్గింపుతో ఆ పెంపును పూర్తిగా వెనక్కి తీసుకున్నట్లయింది. మరోవైపు మే నెల ద్వితీయార్థంలో ప్రభుత్వ రంగ సంస్థలు పలు దఫాలుగా పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.7.50 చొప్పున పెంచడం గమనార్హం.

### వాట్సాప్ యూజర్‌నేమ్ వ్యవహారం..
### కేంద్రం నోటీసులు

మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా వాట్సాప్‌లో సంభాషణలు ప్రారంభించేలా రూపొందించిన 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ కొత్త వ్యవస్థ సైబర్ నేరాలు, ఫిషింగ్, ఇంపర్సనేషన్, 'డిజిటల్ అరెస్ట్' తరహా మోసాలకు అవకాశం కల్పించే ప్రమాదం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఈ ఫీచర్‌పై నియంత్రణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ భారత కార్యకలాపాలకు సంబంధించిన వాట్సాప్ చీఫ్ కంప్లయన్స్ అధికారికి పంపిన లేఖలో, యూజర్‌నేమ్ ఫీచర్‌ను ప్రపంచవ్యాప్తంగా దశలవారీగా ప్రవేశపెడుతున్నట్లు కంపెనీ ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించింది. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌కు బదులుగా ప్రత్యేక యూజర్‌నేమ్‌ను ఉపయోగించి కొత్త వ్యక్తులతో చాట్ ప్రారంభించవచ్చు. పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత మొదటిసారి సంప్రదించే వారికి ఫోన్ నంబర్ కనిపించకుండా ఉండేలా ఈ వ్యవస్థ రూపొందించారు.

# జూన్‌లో జోరుగా జీఎస్టీ వసూళ్లు..
## రూ.1.94 లక్షలు దాటిన ఆదాయం




దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. అయితే దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధిరేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధిరేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరాయి. ఎగుమతులపై 'ఐస్‌గేట్' ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టంచేస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

## స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్.. లాభాల్లో క్లోజ్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల్లో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దాంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడినట్లయ్యింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 140 పాయింట్లు లాభపడింది. సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నెల్, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.23 ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## భారత్ తుది జట్టు ఇదే!
# వైభవ్‌కు నో ఛాన్స్

ఐర్లాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాభావం తర్వాత తొలి మ్యాచ్ ఆడేందుకు టీమిండియా సిద్ధమైంది. బుధవారం దుర్హమ్ వేదికగా ఇంగ్లండ్‌తో మొదటి టీ20లో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి తిరిగి కమ్‌బ్యాక్ ఇవ్వాలని మెన్ ఇన్ బ్లూ పట్టుదలతో ఉంది. బౌన్సీ పిచ్‌లపై రాణించేందుకు భారత బ్యాటర్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. అయితే ఈ మ్యాచ్‌కు ముందు శ్రేయస్ సేనకు ఓ గుడ్ న్యూస్ అందింది. గాయం కారణంగా ఐర్లాండ్ టూర్‌కు దూరమైన స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తిరిగి కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఇంగ్లండ్‌తో తొలి టీ20లో చక్రవర్తి బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. అతడు పునరాగమనం చేస్తే పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ సూర్యన్ష్ షెడ్గేను పక్కన పెట్టే అవకాశముంది. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌కు కూడా బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశముంది. ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను కొనసాగించాలని టీమ్ మేనెజ్‌మెంట్ నిర్ణయించే అవకాశముంది. ఐర్లాండ్ సిరీస్‌లో సంజూ విఫలమైనప్పటికి.. ఇంగ్లండ్ సిరీస్‌లో తిరిగి పుంజుకుంటాడని కోచ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బలంగా నమ్ముతున్నారు. ఒకవేళ తొలి మూడు టీ20లలో శాంసన్ విఫలమైతే వైభవ్ తుది జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది. అదేవిధంగా యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు మరో అవకాశమిచ్చేందుకు మేనెజ్‌మెంట్ సిద్ధమైనట్లు సమాచారం. బ్యాటింగ్ విభాగంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకోపోవచ్చు. ఇంగ్లండ్ ఇప్పటికే తమ తుది జట్టును ప్రకటించింది. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌కు ఇంగ్లండ్ క్రికెట్ విశ్రాంతి ఇచ్చింది.




**తుది జట్లు**

భారత్(అంచనా): అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వరుణ్ చక్రవర్తి

ఇంగ్లండ్: ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కర్రన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, ల్యూక్ వుడ్, సాకిబ్ మహమూద్

### 40 ఏళ్ల తర్వాత నాకౌట్‌లో విక్టరీ..
### ఈక్వెడార్‌పై 2-0 గోల్స్ తేడాతో మెక్సికో విజయం



**మెక్సికో సిటీ:** ఫిఫా వరల్డ్‌కప్‌లో కోహోస్ట్ మెక్సిక్.. రౌండ్16లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈక్వెడార్‌తో జరిగిన రౌండ్ 32 మ్యాచ్‌లో.. 2-0 గోల్స్ తేడాతో మెక్సికో విజయం సాధించింది. నాకౌట్ దశలో దాదాపు 40 ఏళ్ల తర్వాత మెక్సికో విజయాన్ని నమోదు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ తొలి అర్ధభాగంలో రావడం గమనార్హం. తొలుత 22వ నిమిషంలో జులియన్ క్వినోనిస్ , ఆ తర్వాత 9 నిమిషాల వ్యవధితో జిమినేజ్ మరో గోల్ కొట్టాడు. చివరిసారి 1986లో బల్గేరియాతో జరిగిన మ్యాచ్‌లో రౌండ్16 నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత మళ్లీ మెక్సికో ఈసారి విజయాన్ని నమోదు చేసింది. అయితే వరుసగా ఏడు సార్లు మెక్సికో నాకౌట్ దశలో ఓటమి పాలైంది. క్వినోనిస్ ఈ టోర్నీలో మూడో గోల్ చేశాడు.

## స్పోర్ట్స్

### టీ20 జట్టు ఓనర్‌గా రాహుల్ ద్రవిడ్..
### కెప్టెన్‌గా అశ్విన్




యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో 'డబ్లిన్ గార్డియన్స్' కెప్టెన్‌గా భారత లెజెండరీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఎంపికయ్యాడు. డబ్లిన్ జట్టుకు అశ్విన్ సారథిగానే కాకుండా మెంటార్‌గా కూడా తన సేవలను అందించనున్నాడు. ఈ విషయాన్ని డబ్లిన్ గార్డియన్స్ ఫ్రాంచైజీ అధికారికంగా ధ్రువీకరించింది. కాగా డబ్లిన్ ఫ్రాంచైజీని భారత మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. "యూరప్‌లోని యువ ప్రతిభను వెలికితీయడానికి ఈటీపీఎల్ ఒక గొప్ప వేదిక. అందుకే నేను ఈ లీగ్‌లో భాగమయ్యాను. డబ్లిన్‌లో ఇప్పటికే క్రికెట్‌కు మంచి ఆదరణ ఉంది. ఇక అశ్విన్ వంటి అనుభవజ్ఞుడు దొరకడం మా జట్టు అదృష్టం. అతడు మా జట్టు కెప్టెన్‌గా, మెంటార్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. క్రికెట్ విషయాల్లో నేను జోక్యం చేసుకోను. మైదానంలో వ్యూహాలు, నిర్ణయాలు తీసుకునే పూర్తి స్వేచ్ఛ అశ్విన్‌కే ఉంటుందని" ద్రవిడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. కాగా ఈ టీ20 టోర్నీని క్రికెట్ ఐర్లాండ్, క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 6 ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. మిచెల్ మార్ష్, మాక్స్‌వెల్, శాంట్నర్, ఫాఫ్ డుప్లెసిస్ వంటి స్టార్ క్రికెటర్లు ఈ టోర్నీలో భాగం కానున్నారు. అంతేకాకుండా ఈ లీగ్‌లో ద్రవిడ్‌తో పాటు బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ కూడా ఓ ఫ్రాంచైజీని కొనుగోలు చేశారు. ఈటీపీఎల్ తొలి సీజన్ ఆగస్టు 26 నుండి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది.

ఫ్రాంచైజీల వివరాలు ఇవే

డబ్లిన్ గార్డియన్స్ (కెప్టెన్: ఆర్. అశ్విన్, యజమాని: రాహుల్ ద్రవిడ్)
అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ (కెప్టెన్: మిచెల్ మార్ష్, సహ యజమాని: స్టీవ్ వా)
ఎడిన్‌బర్గ్ కాజిల్ రాకర్స్ (కెప్టెన్: మిచెల్ సాంట్నర్)
గ్లాస్గో కాస్మిక్ (యజమాని: క్రిస్ గేల్)
ఐరిష్ వోల్వ్స్ (కెప్టెన్: గ్లెన్ మాక్స్‌వెల్)
రోటర్‌డామ్ డాకర్స్ (కెప్టెన్: ఫాఫ్ డు ప్లెసిస్, యజమాని: జోంటీ రోడ్స్)

## సెన్సార్ పూర్తి చేసుకున్న ఆలియా 'ఆల్ఫా'.. రన్‌టైమ్ ఎంతంటే?

బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' విడుదలకు సర్వం సిద్ధమైంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుండి 'యు/ఏ 16+' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. మొత్తం 2 గంటల 20 నిమిషాల (140 నిమిషాలు) రన్‌టైమ్‌తో వస్తున్న ఈ చిత్రంలో ఫస్టాఫ్ 1 గంట 13 నిమిషాలు, సెకండాఫ్ 1 గంట 7 నిమిషాలు ఉండనుంది. సెన్సార్ బోర్డు సినిమాలో పెద్దగా సీన్లు ఏవీ తొలగించనప్పటికీ, ఫస్టాఫ్‌లోని కొన్ని పదాలను మ్యూట్ చేయడంతో పాటు సెకండాఫ్‌లో వచ్చే కొన్ని తీవ్రమైన హింసాత్మక సన్నివేశాలను తగ్గించి ప్రత్యామ్నాయ విజువల్స్ ఉంచాలని సూచించింది. అలాగే ప్రారంభ డిస్క్లైమర్ కార్డ్ మార్పు, పాటలకు సబ్‌టైటిల్స్, మద్యం సీన్లలో హెచ్చరికలు చేర్చాలని మేకర్స్‌ను ఆదేశించింది. యష్ రాజ్ ఫిల్మ్స్ (=ఫీ) ప్రతిష్టాత్మక 'స్పై యూనివర్స్' లో వస్తున్న మొదటి మహిళా ప్రధాన చిత్రం ఇదే కావడం విశేషం. శివ్ రవైల్ దర్శకత్వంలో ఆలియా భట్, శర్వరి వాగ్, అనీల్ కపూర్, బాబీ డియోల్, ఆర్. మాధవన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ అంచనాల మధ్య విడుదల కానుంది.




## టాలీవుడ్‌లో సరికొత్త సాంకేతిక అద్భుతం.. తొలి పూర్తి స్థాయి ఏఐ మూవీగా 'అంబ'ం రివెంజ్'!



తెలుగు సినీ పరిశ్రమలో సాంకేతిక విప్లవానికి సరికొత్త నాంది పలుకుతూ 'అంబ'ం రివెంజ్' అనే అద్భుత చిత్రం శరవేగంగా ముస్తాబవుతోంది. నక్క తోక ఫిలిమ్స్ బ్యానర్‌పై యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జయవర్ధన్ మడి సరికొత్త ఆలోచనలతో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. టాలీవుడ్ చరిత్రలోనే సరికొత్త మైలురాయిగా నిలిచేలా, పూర్తి స్థాయి కృత్రిమ మేధ సహకారంతో రూపొం దుతున్న తొలి తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా ఈ మూవీ రికార్డు సృష్టిస్తూ, తాజాగా తన ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. భారత అత్యున్నత ఇతిహాసమైన మహాభారతంలోని అత్యంత శక్తివంతమైన, ప్రతికారేచ్ఛ గల పాత్ర 'అంబ' స్ఫూర్తితో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఆ పురాణ గాథను నేటి ఆధునిక దృక్పథానికి అనుగుణంగా మలుస్తూ, అత్యాధునిక ఏఐ సాంకేతికతను మేళవించి వినూత్నంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావా లని చిత్ర బృందం ఎంతో పట్టుదలతో పనిచేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఏఐ విజువల్ డిజైన్ డ డెవలప్‌మెంట్‌ను ప్రసిద్ధ 'కాలై విజువల్ స్టూడియోస్' అందిస్తుండటం సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ ప్రయోగాత్మక చిత్రం గురించి నిర్మాతలు యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్ మరియు దర్శకుడు జయవర్ధన్ మడి మాట్లాడుతూ, తెలుగు సినిమా రంగానికి ఇది ఒక కొత్త ప్రయోగాత్మక అధ్యాయానికి నాంది అని ఎంతో గర్వంగా ప్రకటించారు.

# బ్రేకప్ రూమర్లకు కృతి సనన్ ఫుల్ స్టాప్..

## బాయ్‌ఫ్రెండ్ కబీర్‌తో ఫోటో వైరల్!




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొంతకాలంగా లండన్‌కు చెందిన వ్యాపారవేత్త కబీర్ బాహియాతో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల వీరిద్దరూ విడిపోయారంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కృతి చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఆ రూమర్లకు చెక్ పెట్టిందా అనే చర్చ మొదలైంది. కృతి సనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ ఏడాది తొలి ఆరు నెలలకు సంబంధించిన ప్రత్యేక క్షణాలను 'హాఫ్ ఇయర్లీ డంప్' పేరుతో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోలలో ఆమె కుటుంబ సభ్యులు, సోదరి నుపూర్ సనన్, పెంపుడు కుక్క, పర్యటనలకు సంబంధించిన చిత్రాలతో పాటు నటి రష్మిక మందన్నతో దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి. అయితే అందరి దృష్టిని ఆకర్షించింది కబీర్ బాహియాతో ఉన్న ఒక ఫోటో. లైవ్ మ్యూజిక్ ఈవెంట్‌లో ఇద్దరూ కలిసి కనిపించిన ఈ ఫోటోలో ఒకరినొకరు ఆప్యాయంగా హత్తుకున్నట్లు కనిపించారు. దీంతో వీరిద్దరూ ఇప్పటికీ రిలేషన్‌లోనే ఉన్నారనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కబీర్ బాహియా మరో యువతితో కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, కృతి--కబీర్ మధ్య బ్రేకప్ జరిగిందనే ప్రచారం మొదలైంది. అయితే జాతీయ మీడియా కథనాల ప్రకారం, కబీర్‌కు సన్నిహిత వర్గాలు ఆ ప్రచారాన్ని ఖండించాయి. వైరల్ అయిన ఫోటోలో కనిపించిన యువతి కబీర్ కుటుంబానికి అత్యంత సన్నిహితురాలని, ఆమెను ఆయన సోదరిలా భావిస్తారని పేర్కొన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని వారు తెలిపినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కృతి సనన్ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. తన సంబంధాలపై బహిరంగంగా చర్చించేందుకు ఆసక్తి లేదని, వివాహం జరిగే వరకు వ్యక్తిగత విషయాలను ప్రైవేట్‌గా ఉంచాలనుకుంటున్నానని ఆమె చెప్పారు.

## సినిమాల్లో ఆ హీరోయిన్ అంటే క్రష్: ఆనంద్ దేవరకొండ




టాలీవుడ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రస్తుతం ఎపిక్ మూవీలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో బేబీ మూవీ ఫేమ్ వైష్ణవి చైతన్య మరోసారి ఆనంద్ సరసన హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ కాగా.. అద్భుతమైన రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఇక ఈ సినిమా సంగతి పక్కన పెడితే ఆనంద్ దేవరకొండ తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. సమ్మర్ హాలీడేస్ మూవీలోని క్రష్ సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో ముఖ్య? అతిథిగా పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో ఆనంద్‌కు ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. మీ ఫస్ట్ క్రష్ ఎవరు? అని యాంకర్ ప్రశ్నించారు. దీనికి ఆనంద్ దేవరకొండ నవ్వుతూ సమాధానమిచ్చారు. ఏదైనా సినిమా చూసేటప్పుడు హీరోయిన్లపై క్రష్ ఉంటుంది.. అలా మురారి చూసినప్పుడు నాకు సోనాలి బింద్రేపై క్రష్ ఫీలింగ్ వచ్చిందని అన్నారు. కాగా.. రోహన్ రాయ్, అరుణ్ దేవ్ ప్రధానపాత్రల్లో, శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తోన్న చిత్రం సమ్మర్ హాలీడేస్. ఈ మూవీని బాల్యం కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో జయసుధ, వాసుకి ఆనంద్, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## 'అమీర్ లోగ్' టీంకు రానా దగ్గుబాటి సపోర్ట్.. హైప్ పెంచేస్తున్న నయా అప్‌డేట్..!

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సినిమాలకు మంచి క్రేజ్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే జోనర్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్నచిత్రం అమీర్ లోగ్. రమణారెడ్డి సోమ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వేదా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. అమీర్ లోగ్ తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కులను టాలీవుడ్ యాక్టర్ రానా నేతృత్వంలోని స్పిరిట్ మీడియా సొంతం చేసుకుంది. హైదరాబాద్ గల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు స్నేహితుల మధ్య కథ నేపథ్యంలో కామెడీతోపాటు కంటెంట్‌ను నమ్మి వస్తున్న సినిమా కావడం, రానా టీం విడుదల చేస్తుండటంతో హైప్ పెరిగిపోతుంది. ఈ మూవీని అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ తెరకెక్కిస్తున్నారు. అమీర్ లోగ్ సినిమాలో రాహుల్ సిప్లిగంజ్ పాడిన అవ్వల్ దావత్ సాంగ్ యూట్యూబ్‌లో మిలియన్‌కు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచిందని తెలిసిందే. రాహుల్ సిప్లిగంజ్ మాసీ వాయిస్, మరోవైపు ఆనీ మాస్టర్ మాస్ డ్యాన్స్‌తో ఫ్లోర్ దద్దరిల్లిపోయేలా సాగుతున్న ఈ సాంగ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ, మ్యూజిక్ లవర్స్. ఇప్పటికే లాంచ్ చేసిన అమీర్ లోగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ మూవీకి స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నాడు.

## అమెరికాలో సమంత సెన్సేషన్.. 'మా ఇంటి బంగారం'తో 2026లో అరుదైన రికార్డు!




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. కొంత విరామం తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత, ఈ సినిమాతో మరోసారి తన స్టార్‌డమ్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్లలో మంచి ఆదరణతో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్లలోనూ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అమెరికా బాక్సాఫీస్ వద్ద సినిమా నమోదు చేస్తున్న వసూళ్లు సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' అమెరికాలో రెండో మంగళవారం ఒక్క రోజులోనే 70 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో 2026లో విడుదలైన తెలుగు చిత్రాల్లో రెండో మంగళవారం అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని ట్రేడ్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.అయితే ఈ వసూళ్లపై చిత్రబృందం లేదా అధికారిక బాక్సాఫీస్ వర్గాల నుంచి ఇంకా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. అమెరికా మార్కెట్‌లో స్థిరంగా వసూళ్లు కొనసాగిస్తున్న ఈ చిత్రం, త్వరలోనే 2 మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకునే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక మహిళా ప్రధాన పాత్రతో తెరకెక్కిన సినిమా ఈ స్థాయిలో వసూళ్లు నమోదు చేయడం విశేషంగా చెప్పబడుతోంది. 'మా ఇంటి బంగారం'తో సమంత మరోసారి తన మార్కెట్ బలాన్ని చాటుకున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న కథను ఎంచుకుని ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, నిర్మాతగా కూడా ఈ సినిమాతో విజయాన్ని అందుకున్నట్లు చెబుతున్నారు. దర్శకురాలు నందిని రెడ్డి రూపొందించిన ఈ చిత్రంలో భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సమంత నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'మా ఇంటి బంగారం', దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ తన జోరు కొనసాగిస్తూ 2026లో టాలీవుడ్‌కు చెందిన విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967